ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
మంగళవారం 29 ఏప్రిల్ 2025



ట్యాంపరింగ్‌కు చెక్



- సరికొత్తగా రెవెన్యూ రికార్డుల తయారీ
- పైలెట్ ప్రాజెక్టుగా బి.మఠంలో శ్రీకారం
- డిప్యూటీ కలెక్టర్ నేతృత్వంలో రికార్డుల పరిశీలన

(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ ఐదేళ్ల పాలనలో కొందరు వైసీపీ నేతలు చేసిన అరాచకం అంతా ఇంతా కాదు. ప్రభుత్వ భూములతో పాటు విలువైన ప్రైవేటు భూములను ఆక్రమించేశారు. కోట్లాది రూపాయల విలువ చేసే భూములు కళ్లెదుటే కబ్జా అవుతున్నా రెవెన్యూ శాఖ చేష్టలుడిగి చూస్తూ ఉండేది. మా భూములు ఆక్రమించారు కుయ్యో మొర్రో అని తహశీల్దారు కార్యాలయం మెట్లెక్కినా, పోలీసుస్టేషనుకు వచ్చినా బాధితులకు న్యాయం జరగలేదు. అప్పుడు అధికారులంతా వైసీపీ సైడే. చంద్రబాబు సర్కారు వచ్చాక వైసీపీ హయాంలో జరిగిన భూకబ్జాలపై దృష్టి పెట్టింది. భూ ఆక్రమణల గుట్టు రట్టు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించడంతో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తన సైన్యంతో వైసీపీ భూకబ్జాదారుల భరతం పడుతూ వచ్చారు. ఇప్పటికే అన్యాక్రాంతమైన సుమారు వంద ఎకరాల భూములను తిరిగి స్వాధీనం చేసుకున్నారు. కబ్జాదారులకు ఎక్కడా అవకాశం ఇవ్వకుండా జేసీ అదితిసింగ్ నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారు. ఆర్డీవోతో పాటు లీగల్ టీంను ఏర్పాటుచేసి కబ్జారాయుళ్ల నుంచి భూముల స్వాధీనానికి చర్యలు తీసుకుంటూ వచ్చారు.

రెవెన్యూ భాషలో గోల్డెన్ బుక్

భూకబ్జాల సమస్యల పరిష్కారం కోసం ఇటీవల ప్రభుత్వం రెవెన్యూ గ్రామసభలు నిర్వహించింది. కుప్పలు కుప్పలుగా భూసమస్యలపై ఫిర్యాదులు వచ్చాయి. వీటితో పాటు సీఎం చంద్రబాబునాయుడుకు, టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో మంత్రులకు ఇచ్చే వినతిపత్రాలతో పాటు ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల వేదికకు 250 నుంచి 300 వరకు మన జిల్లాలో భూసమస్యలపైనే ఫిర్యాదులు వస్తున్నాయి. వీటిపై అధ్యయనం చేసిన కలెక్టర్ వీటికి శాశ్వత పరిష్కారం చూపించాలంటే సొంతింటిని చక్కదిద్దాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా గ్రామ స్థాయిలో రెవెన్యూ రికార్డుల స్వచ్ఛీకరణకు శ్రీకారం చుట్టారు. ఓ విధంగా చెప్పాలంటే రెవెన్యూ పరిభాషలో గోల్డెన్‌బుక్ లాంటిది. దీనిని కబ్జాలకు నిలయమైన బ్రహ్మంగారిమఠం నుంచి అమలు చేస్తున్నారు.

రికార్డుల స్వచ్ఛీకరణతో..

ఐదేళ్ల వైసీపీ హయాంలో పెద్దఎత్తున భూకబ్జాలు సాగాయి. ప్రభుత్వ భూములతో పాటు ప్రైవేటు భూములు ఆక్రమించారు. ఖాళీగా ఉన్న ఇంటిస్థలాలపై లెక్కలేనన్ని పట్టాలు పుట్టుకొచ్చాయి. కడప, కలసపాడు, కాశినాయన, పోరుమామిళ్ల, బి.కోడూరు, అట్లూరు, బ్రహ్మంగారిమఠం, ఖాజీపేట, దువ్వూరు, సీకేదిన్నె, వీఎన్‌పల్లె, చక్రాయపేట, తొండూరు, లింగాల, సింహాద్రిపురం, పెద్దముడియం.. ఇలా పలు మండలాల్లో భారీ ఎత్తున భూకబ్జాలు సాగాయి. వీటన్నంటికీ ఫుల్‌స్టాప్ పెట్టాలంటే 2019కి మునుపున్న రెవెన్యూ రికార్డులు, ఇప్పుడున్న రెవెన్యూ రికార్డులు పరిశీలించాలని నిర్ణయించారు. కోర్టుల్లో అన్నదమ్ముల మధ్య ఆస్తుల తగాదాలు మినహాయిస్తే మిగతా ప్రభుత్వ ప్రైవేటు ఆస్తుల వివరాలను పరిశీలించి ఒక పక్క స్వచ్ఛీకరణ చేసి రికార్డు తయారుచేస్తేనే కబ్జాలకు బ్రేక్ పడుతుంది. వైసీపీ హయాంలో రికార్డుల ట్యాంపరింగ్ జరిగిందని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి గుర్తించారు. దీంతో డిప్యూటీ కలెక్టర్ ఆధ్వర్యంలో ఒక్కో మండలానికి ఒక్కో అధికారిని నియమించి ఒక్కో రెవెన్యూ గ్రామంలో ఐదు నుంచి వారం రోజుల పాటు రికార్డులను 2019మునుపు రికార్డులను, ప్రస్తుత రికార్డులను పరిశీలించాలని నిర్ణయించారు.

రెండో విడత భూముల రీసర్వే

జిల్లాలో రెండో విడత భూముల రీసర్వే జరగనుంది. మొత్తం 23 మండలాల్లో 40,385 ఎకరాల భూములు రీసర్వే చేయనున్నారు. కమలాపురం, ఖాజీపేట, సిద్దవటం వల్లూరు, పెండ్లిమర్రి, చెన్నూరు, తొండూరు, వేంపల్లె, అట్లూరు, కలసపాడు, బి.కోడూరు, పోరుమామిళ్ల, మైదుకూరు, కాశినాయన, కొండాపురం, దువ్వూరు, ప్రొద్దుటూరు, చాపాడు, రాజుపాలెం, జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం మండలాల్లో ఒక్కోగ్రామం చొప్పున 23 గ్రామాల్లో రీసర్వే చేయనున్నారు. ఈ గ్రామాల్లో రీ సర్వేపూర్తి చేయడానికి ముందే రికార్డుల స్వచ్ఛీకరణ చేయాలని కలెక్టర్ నిర్ణయించారు. ఇందులో భాగంగా ప్రస్తుతం బి.మఠం మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి అక్కడ రికార్డుల స్వచ్ఛీకరణ సాగుతోంది. అక్కడ వచ్చే రిజల్ట్‌ను బట్టి లోపాలను చూసి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో అమలు చేయనున్నారు. ఇది పక్కాగా అమలు అయితే రెవెన్యూ రికార్డులు ట్యాంపరింగ్ చేసే అవకాశం ఉండదు. ముఖ్యంగా కడప, బద్వేలు, పోరుమామిళ్ల, పులివెందుల భూమాఫియా నుంచి జనాలకు రక్షణ దొరుకుతుంది.

ఫిర్యాదుదారులకు న్యాయం చేయండి : ఎస్పీ



బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదుదారులకు చట్టపరిధిలో న్యాయం చేయాలని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ప్రజలతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడారు. వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులకు ఫోను చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీచేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

కడప మారుతీనగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా మే 12న తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచల ప్రదర్శనకు వీలుగా కడప రీజియన్ పరిధిలోని వివిధ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు కడప రీజనల్ మేనేజరు పి.గోపాల్‌రెడ్డి తెలిపారు. ఆ మేరకు కడప డిపో నుంచి 11వ తేదీ ఉదయం 6గంటలకు బస్సు బయలుదేరి రాయచోటి, చిత్తూరు, వేలూరు, గోల్డెన్ టెంపుల్ మీదుగా రాత్రి 9కి తిరువణ్ణామలై చేరుకుంటుందన్నారు. బద్వేలు డిపో నుంచి 11వ తేదీ ఉదయం 9గంటలకు, మైదుకూరు డిపో నుంచి మధ్యాహ్నం 3గంటలకు, ప్రొద్దుటూరు డిపో నుంచి సాయంత్రం 6గంటలకు, జమ్మలమడుగు డిపో నుంచి సాయంత్రం 6గంటలకు, మరో బస్సు రాత్రి 8గంటలకు, పులివెందుల డిపో నుంచి ఉదయం 7గంటలకు బస్సులు బయలుదేరి తిరువణ్ణామలై చేరుతాయన్నారు.

కడప డిపో నుంచి అయితే టికెట్ ధర రూ.1,249, రూ.1,044, బద్వేలు నుంచి రూ.1,282, మైదుకూరు నుంచి రూ.1,209, ప్రొద్దుటూరు నుంచి రూ.1,273, పులివెందుల నుంచి రూ.1,242, జమ్మలమడుగు డిపో నుంచి రూ.1,363 చార్జీలని తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సీట్లను ముందస్తుగా బుక్ చేసుకోవాలని కోరారు.

ఏవో, ఈవోపీఆర్డీలకు ఎంపీడీవోలుగా పదోన్నతి

కడప రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పలువురు ఏవోలకు, ఈవోపీఆర్డీలకు ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పించారు. ఈ మేరకు కడప జిల్లా ప్రజాపరిషత్ శాఖలో సింహాద్రిపురం మండల ఏవో శ్రీనివాసులరెడ్డికి, జిల్లా పంచాయతీశాఖలో చాపాడు మండల ఈవోపీఆర్డీగా పనిచేస్తున్న రాధాకృష్ణవేణిలకు ఎంపీడీవోలుగా పదోన్నతి కల్పించారు. అన్నమయ్య జిల్లా పరిషత్‌లోని రామసముద్రం మండలం ఏవో షేక్ గౌస్‌బాషాకు ఎంపీడీవో పదోన్నతి కల్పించి కడప జిల్లాకు అపాయింట్‌మెంట్ ఇచ్చారు. వీరిని స్థానిక డివిజన్‌లో నియమించరాదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆర్డర్ అందిన తేదీ నుంచి 15 రోజుల గడువులోగా ఎంపీడీవో పదవిలో చేరాలని, నిర్ణీత గడువులోపు కొత్త పోస్టులో చేరడంలో విఫలమైతే, లేదా సెలవుపై కొనసాగడం ద్వారా పోస్టులో చేరకుండా తప్పించుకుంటే నియామక హక్కును కోల్పోతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఏకసంథాగ్రాహి..

- ఒకసారి వింటే చాలు..
- అనర్గళంగా ఇంగ్లీష్, తెలుగు పాఠ్యాంశాలను అప్పజెబుతున్న విద్యార్థి



7

కేఫ్‌లో అగ్నిప్రమాదం

- విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు
- రూ.4లక్షల ఆస్తి నష్టం

7

స్పెషల్ డ్రైవ్‌లో 42 వాహనాలు సీజ్

7



డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్ల నియామకం

కడప, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తోంది. పార్టీ కోసం అకుంఠిత దీక్షతో పనిచేసిన కేడరుకు పదవులు కట్టబెడుతోంది. ఇప్పటికే ఎస్సీ ఎస్టీ బీసీ కార్పొరేషన్ల పదవులతో పాటు మార్కెట్‌యార్డులను భర్తీచేస్తూ వచ్చింది. తాజాగా ఉమ్మడి జిల్లాలో కీలకమైన డీసీసీబీ చైర్మన్ పదవిని ఎం.సూర్యనారాయణరెడ్డికి కట్టబెట్టగా, డీసీఎంఎస్ చైర్మన్‌గా రైల్వేకోడూరు మండలం శెట్టిగుంట పంచాయతీకి చెందిన ఎర్రగుండ్ల జయప్రకాశ్‌ను నియమించారు.

డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నికైన మంచూరు సూర్యనారాయణరెడ్డి అట్లూరు మండలంలోని వేమలూరు వాసి. పార్టీ ఆవిర్భావం నుంచి టీడీపీలో కొనసాగుతున్నారు. లోకేశ్ పాదయాత్రతో పాటు మొన్న జరిగిన ఎన్నికల్లో తనపాత్ర పోషించారు.



డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్యనారాయణరెడ్డి



డీసీఎంఎస్ చైర్మన్ ఎర్రగుండ్ల జయప్రకాశ్

బద్వేలు నియోజకవర్గంలో కీలక నేతగా గుర్తింపు పొందారు. కొన్ని సామాజిక కార్యక్రమాలు చేస్తూ వస్తున్నారు. ఇక డీసీఎంఎస్ చైర్మన్‌గా రైల్వేకోడూరుకు చెందిన ఎర్రగుండ్ల జయప్రకాశ్‌ను నియమించారు. ఈయన టీడీపీలో క్రియాశీలకంగా ఉన్నారు. కాగా.. టీడీపీలో కష్టపడేవారికే పదవులు దక్కుతాయనడానికి డీసీసీబీ చైర్మన్‌గా ఎంపికైన మంచూరు సూర్యనారాయణరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ జయప్రకాశ్ నియామకాలే నిదర్శనమని పొలిట్‌బ్యూరోసభ్యుడు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందన్నారు.

పాడిరైతులకు 50 శాతం రాయితీతో దాణా

కడప రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పాడిరైతులకు 50 శాతం రాయితీతో సమీకృత దాణా అందిస్తుందని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ శారదమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 50 కిలోల దాణా బ్యాగ్ పూర్తి ధర రూ. 1110లు కాగా ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో రూ.555లకు ఇస్తుందని పేర్కొన్నారు. దాణా అవసరమైన పాడిరైతులు రైతు సేవా కేంద్రాలలో గానీ, పశువైద్యాధికారిని గాని సంప్రదించాలని సూచించారు. భారత్ పశుధన్ యాప్‌లో రైతు పేరు నమోదై ఉండడంతో పాటు పశువులకు టీకాలు వేసి ఉండాలని, తెల్లరేషన్ కార్డు కలిగిన పాడిరైతులకు మాత్రమే తొలుత ఒక బ్యాగ్ ఇస్తారని తెలిపారు.

చెన్నకేశవునికి అష్టోత్తర కలశాభిషేకం

వల్లూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): హరిహర క్షేత్రమైన పుష్పగిరిలో కామాక్షి సమేత వైద్యనాథేశ్వర, లక్ష్మిచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు సోమవారం వైద్యనాథేశ్వరునికి ప్రీతికరమైన మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు చేశారు. కామాక్షి అమ్మవారికి దేవీ ఖడ్గమాలతో, శ్రీచక్రానికి కుంకుమార్చనలు చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా వివిధ హోమాలను, జపాలను వేదపండితులు నిర్వహించారు. సాయంత్రం వేళ వైద్యనాథేశ్వరుడు పురుషాన్ మృగవాహనంపై ఊరేగారు. అలాగే కొండపైన లక్ష్మిచెన్నకేశవస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా అష్టోత్తర కలశాభిషేకం ఆలయ ప్రధాన అర్చకులు చేపట్టారు. అనంతరం మూలవిరాట్ చెన్నకేశవునికి అభిషేకం చేపట్టారు. సాయంత్రం పూజలు, వివిధ హోమాలు నిర్వహించిన అనంతరం యాలి వాహనంపై చెన్నకేశవుడికి గ్రామోత్సవం చేపట్టారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారికి కాయ కర్పూరం చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు.

యాలి వాహనంపై చెన్నకేశవుడు





అష్టోత్తర కలశాలకు పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బాధితులు సమర్పించే అర్జీలకు సత్వరమే పరిష్కారం చూపాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో డీఆర్వోతో పాటు డిప్యూటీ కలెక్టర్లు శ్రీనివాసులు, వెంకటపతి, జడ్పీ సీఈవో ఓబులమ్మ, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు ప్రజలు సమర్పించిన అర్జీలను పరిశీలించి తదుపరి చర్యలకై సంబంధిత అధికారులకు సిఫారసు చేశారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ అర్జీదారుడు సత్తృప్తి చెందేలా అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలన్నారు. ఫిర్యాదు దారుల విజ్ఞప్తులను క్షేత్రస్థాయిలో అధికారులు స్వయంగా వెళ్లి పరిశీలించి, పారదర్శకంగా అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలన్నారు. కడప నగరంలోని ప్రకాష్‌నగర్‌కు చెందిన నారాయణరెడ్డి ఫిర్యాదు చేస్తూ తన ఇంటి స్థలాన్ని ఇతరులు ఆక్రమించి గేటు ఏర్పాటు చేశారని, అధికారులు విచారించి తనకు న్యాయం చేయాలని కోరారు. తనకు ఎలాంటి భూములు లేకున్నా ఆన్‌లైన్‌లో ఉన్నట్లుగా చూపుతుండటంతో కుమారుడి చదువుకు ఉపకార వేతనం అందడం లేదని, ఆన్‌లైన్‌లో తనపేరుతో ఉన్న భూమిని తొలగించాలని సీకేదిన్నె మండలం మామిళ్లపల్లికి చెందిన కృష్ణారెడ్డి ఫిర్యాదు చేశారు. కమలాపురం మండలం అప్పాయపల్లికి చెందిన మునీర్ అహమ్మద్ ఫిర్యాదు చేస్తూ సర్వే నెంబరు 847/ఏలో 4.79 ఎకరాల భూమి ఆన్‌లైన్‌లో దేవదాయశాఖ భూమిగా నమోదయిందని, రికార్డులను సవరించి న్యాయం చేయాలని విన్నవించారు.

ఐఎస్‌వో సర్టిఫికెట్ పోటీలో..

పీలేరు గ్రామ పంచాయతీ



- పైలెట్ పంచాయతీగా ఎంపిక చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- త్వరలో పీలేరుకు రానున్న కేరళ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్
- ముమ్మరంగా ఆధునికీకరణ పనులు

పీలేరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు జవాబుదారీ పాలన అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా స్థానిక సంస్థలను బలోపేతం చేయాలని, వాటిలో పోటీ తత్వాన్ని పెంపొందించాలని అనేక ప్రయత్నాలు చేస్తోంది. స్థానిక సంస్థల నిర్వహణ, పరిపాలనకు దేశంలోనే పేరెన్నిక గలిగిన కేరళ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుంటోంది. పరిపాలన, నిధుల వ్యయం, ప్రజలకు నాణ్యమైన సేవలు, ప్రజల సంతృప్తి స్థాయి లాంటి అనేక అంశాలను అభివృద్ధి చేసి ప్రజల మన్నన చూరగొనాలని చూస్తోంది. అందుకు ఐఎస్‌వో (ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్-అంతర్జాతీయ ప్రమాణీకరణ సంస్థ) సర్టిఫికెట్ల సాధనను ఆలంబనగా చేసుకుంది. అనేక అంశాలను పరిగణలోకి తీసుకుని ఆ సంస్థ వారు ఆ సర్టిఫికెట్‌ను అందిస్తారు. ఆ సర్టిఫికెట్ పొందిన సంస్థలకు రాష్ట్ర, కేంద్ర, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. రాష్ట్రంలో ఐఎస్‌వో సర్టిఫికెట్ సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో రెండు గ్రామ పంచాయతీలను పైలెట్ గ్రామ పంచాయతీలుగా ఎంపిక చేసింది. అలా అన్నమయ్య జిల్లాలోని కోడూరు, పీలేరు గ్రామ పంచాయతీలను జిల్లా పంచాయతీ అధికారులు ఎంపిక చేశారు. ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా పీలేరు గ్రామ పంచాయతీ అధికారులు గడిచిన 20 రోజులుగా ఐఎస్‌వో నిబంధనల మేరకు తమ కార్యాలయాన్ని ఆధునీకరిస్తున్నారు. ఏళ్లుగా నాటుకుపోయిన పాత పద్ధతులను విడనాడి పంచాయతీ కార్యాలయానికి కార్పొరేట్ తరహా సొబగులు అద్దుతున్నారు.

ఐఎస్‌వో సర్టిఫికేషన్ల ప్రయోజనాలు

- ఐఎస్‌వో ప్రమాణాలు ఆయా సంస్థల నాణ్యతా నిర్వహణ వ్యవస్థలను అభివృద్ధి చేయడంలో సహాయపడతాయి.
- ఐఎస్‌వో ధ్రువీకరణలు ఆయా సంస్థల పనితీరును మెరుగుపరుస్తాయి. అవి సమర్థవంతంగా పనిచేసేలా చేస్తాయి.
- ఐఎస్‌వో ధ్రువీకరణలు ఆయా సంస్థల విశ్వసనీయత, వాటిపై ప్రజల నమ్మకాన్ని మెరుగుపరుస్తాయి.
- ఐఎస్‌వో ధ్రువీకరణలు పొందిన స్థానిక సంస్థలకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అదనపు నిధులు కేటాయించి వాటిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాయి.

సలహాదారుగా కేరళ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్ (కిలా)

ఐఎస్‌వో సర్టిఫికేషన్ సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వం తన కేరళ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్(కిలా)ను నియమించుకుంది. కిలా ప్రతినిధులు రాష్ట్రంలోని 52 పైలెట్ పంచాయతీలలో పర్యటించి ఐఎస్‌వో సర్టిఫికెట్ సాధన కోసం ఆయా పంచాయతీల్లో చేపట్టాల్సిన మార్పులు, చేర్పులు, కార్యాలయాల నిర్వహణ, సిబ్బంది పనితీరు, ప్రజలకు అందించాల్సిన వివిధ సేవల గురించి గత రెండు నెలలుగా అవగాహన, శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ ప్రక్రియను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ మంత్రి పవన్‌కళ్యాణ్, రాష్ట్ర పంచాయతీరాజ్ ఓఎస్‌డీ కృష్ణతేజ ప్రత్యేకంగా పర్యవేక్షిస్తుండడంతో 52 పంచాయతీల్లో ఐఎస్‌వో సర్టిఫికేషన్ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

పీలేరు పంచాయతీలో ఆధునిక సౌకర్యాలు

ఐఎస్‌వో సర్టిఫికేషన్ యత్నంలో భాగంగా పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్పొరేట్ తరహా సౌకర్యాలు కల్పిస్తున్నారు. అందులో భాగంగా కార్యాలయానికి వచ్చే ప్రజల కోసం వెయిటింగ్ రూము, హెల్ప్ డెస్క్, వివిధ సేవల సిటిజన్ చార్టర్, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు, మరుగుదొడ్లు, చంటి పిల్లల తల్లులకు ప్రత్యేక గదులు, రికార్డుల ఆన్‌లైన్ నిర్వహణ, నిర్దేశిత సమయంలో సేవలు అందించే విధానం, కార్యాలయంలో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా మొక్కల పెంపకం వంటివి చకాచకా ఏర్పాటు చేస్తున్నారు.

> **ప్రతిష్ఠాత్మకంగా ఐఎస్‌వో సర్టిఫికెట్ సాధన**
>
> - గురుమోహన్, ఈవో, పీలేరు పంచాయతీ
>
> రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ మంత్రి పవన్‌కళ్యాణ్ ఆలోచనలను అనుగుణంగా ఐఎస్‌వో సర్టిఫికేషన్ సాధించేందుకు ప్రతిష్ఠాత్మకంగా పనులు చేస్తున్నాం. ఒకసారి ఆ సర్టిఫికెట్ సాధిస్తే పీలేరు పంచాయతీ రూపురేఖలు మారిపోతాయి. ప్రజలకు నాణ్యమైన సేవలు లభిస్తాయి. పైలెట్ పంచాయతీగా ఎంపికైన నాటి నుంచి పనులను ఎంతో వేగంగా పూర్తి చేస్తున్నాం. త్వరలో రానున్న కిలా బృంద సభ్యుల సలహాలు, సూచనలు తీసుకుని తప్పకుండా సర్టిఫికెట్ సాధిస్తాం.

త్వరలో కిలా బృందం రాక

ఐఎస్‌వో సర్టిఫికేషన్ కోసం జరుగుతున్న పనులను పర్యవేక్షించి లోటుపాట్లు తెలియజేసేందుకు పీలేరుకు త్వరలోనే కిలా బృందం రానుంది. వారు సూచించిన మార్పులు, చేర్పులు చేసుకున్న తరువాత ఐఎస్‌వో బృందం పీలేరు గ్రామ పంచాయతీని పరీక్షించి సర్టిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉంది. పీలేరులో జరుగుతున్న పనులను ఇటీవల జిల్లా పంచాయతీ అధికారి మస్తాన్ వలీ సందర్శించి పలు సూచనలు చేశారు.



కొత్తగా సిద్ధం చేసిన నోటీసు బోర్డులు, కుర్చీలు



ప్రజల కోసం సిద్ధం చేస్తున్న వెయిటింగ్ రూము

గడ్డివామిలో మగశిశువు లభ్యం



శిశువును అందుకుంటున్న ఐసీడీఎస్ అధికారులు

వీరబల్లి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఆ తల్లి నవమాసాలు బిడ్డను మోసింది. పురిటినొప్పులు భరించి పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. అయితే ఆ ముక్కపచ్చలారని పసికందును పుట్టినరోజే ఊరు శివారులోని గడ్డివాములో వదిలేసి వెళ్లిన సంఘటన మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా.. మండలంలోని దిగువరాచపల్లి గ్రామ పంచాయతీ పెద్దహరిజనవాడలో అప్పుడే పుట్టిన మగ పసికందును గుర్తు తెలియని వ్యక్తులు ఊరు శివారులోని గంగమ్మ గుడి దగ్గర ఉన్న ఓ గడ్డివాములో వదిలేసి వెళ్లారు. ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో గ్రామస్థుడు వీరనాగయ్య తమ గడ్డివామి దగ్గరికి వెళ్లి చూడగా మగశిశువు ప్రత్యక్షమయ్యాడు. వెంటనే అతను గ్రామస్థులు తెలియజేసి వెంటనే శిశువుని రాయచోటిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు చేయించారు. శిశువు ఆరోగ్యంగా ఉన్నాడని వైద్యులు తెలపడంతో తిరిగి తన గ్రామానికి తీసుకొచ్చారు. ఎవరో ఆ బిడ్డను ఇక్కడ వదిలేసినట్లు గ్రామస్థులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ అధికారులు, పోలీసులు గ్రామానికి చేరుకొని మగ శిశువును స్వాధీనం చేసుకుని రాయచోటిలోని సఖి కేంద్రానికి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి



కిషోర్ (ఫైల్‌ఫొటో)

తంబళ్లపల్లె, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు చెట్టుకు ఉరి వేసుకుని మృతిచెందిన సంఘటన తంబళ్లపల్లెలో సోమవారం వెలుగు చూసింది. వివరాల మేరకు... తంబళ్లపల్లెకు సమీపంలోని మల్లయ్యకొండకు వెళ్లే దారిలో మద్దాతంబావి వంకలో ఉన్న కానుగచెట్టుకు ఓ యువకుడు ఉరి వేసుకుని మృతి చెందినట్లు గొర్రెల కాపర్లు గుర్తించారు. ఈ విషయాన్ని పోలీసులకు తెలుపగా ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి ఆదేశాలతో ఏఎస్‌ఐ నజీర్‌బాషా ఘటనా స్థలానికి చేరుకుని యువకుడి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు బయట ప్రాంతం నుంచి ద్విచక్రవాహనంలో వచ్చి ఇక్కడ ఉరివేసుకుని మృతి చెందినట్లుగా గుర్తించారు. మృతుడి చిరునామా కోసం వాహన నెంబరుతో ఆన్‌లైన్‌లో శోధించగా బి.కొత్తకోట మండలం తాకటం వారిపల్లెకు చెందిన ఓబులేషు కుమారుడు కిషోర్(22)గా గుర్తించారు. వెంటనే ఈ విషయాన్ని పోలీసులు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు తంబళ్లపల్లెకు చేరుకున్నారు. కిషోర్ గత గత మూడు రోజులుగా కనిపించలేదని అతని కోసం పలు చోట్ల వెతికామని.. ద్విచక్రవాహనం కూడా వారం రోజుల కిందట కొనుగోలు చేసినట్లు తెలిపారు. కాగా, మృతుడి ఎడమచేతిపై కోసుకున్నట్లు గాట్లు ఉండటం, వేలాడుతున్న మృతదేహం కాళ్లకు చెప్పులు అలాగే ఉండటంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏఎస్‌ఐ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా వైద్యశాలకు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీసుస్టేషన్‌లో ఇరువర్గాలు ఫిర్యాదు

సిద్దవటం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మాధవరం గ్రామం నివాసంలో ఉన్న సర్పంచ్ జానకిరామయ్య, టీడీపీ నేత రాజారాం అనే ఇరువురు సోమవారం ఉదయం ఘర్షణ పడి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. జరిగిన ఘటనపై పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లి విచారించారు. పెద్దలు సంపాదించిన ఆస్తి గొడవల్లో ఇరువురికి గత కొన్నిరోజులుగా ఆస్తి తగాదాలు జరుగుతూ ఉన్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే సోమవారం ఘర్షణ పడ్డారు. జరిగిన ఘటనలో టీడీపీ నేత రాజారాం కారు అద్దాలు ఇంట్లో ఉన్న టీవీని పగులగొట్టారు. దీనిపై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా సర్పంచ్ జానకిరామయ్య కూడా రాజారాంపై ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా ఇరువురి ఫిర్యాదులు అందుకుని విచారించి సర్పంచ్ జానకిరామ్‌పై కేసు నమోదు చేసినట్లు ఒంటిమిట్ట సీఐ బాబు తెలిపారు.

విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

- మిట్స్‌లో ఆకట్టుకున్న హ్యాకథాన్ పోటీలు



హ్యాకథాన్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కురబలకోట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ సి.యువరాజ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్‌ఈ, డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఇంటర్ ఇన్‌స్టిట్యూషనల్ హ్యాకథాన్ ఇంపాసిట్స్‌ను నిర్వహించారు. ఈ పోటీల్లో 246 మంది 73 గ్రూపులుగా ఏర్పడి పోటీలలో పాల్గొన్నారు. ప్రధానంగా సాంకేతిక ఆధారిత పరిష్కారాలను రూపొందించడంలో పాల్గొని, నూతన ఆవిష్కరణలను రూపొందించడం దీని ప్రధాన ఉద్దేశ్యమన్నారు. వ్యాపార ప్రణాళికలు, డిజైనింగ్, కోడింగ్, సామాజిక ఆలోచనలతో కూడిన నైపుణ్యాలను ప్రదర్శించారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కాగా పుత్తూరు సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన మనోజ్‌కుమార్ ప్రథమ బహుమతి రూ.25 వేలు, మిట్స్ కళాశాలకు చెందిన తిరిశాంక్ రెండవ బహుమతి రూ.20 వేలు, ఎస్వీ సెట్ కళాశాలకు చెందిన దినేష్‌కుమార్‌రెడ్డి తృతీయ బహుమతి రూ.15వేలు, ఎస్వీసెట్ కళాశాలకు చెందిన శశిధర్‌రెడ్డి నాలుగవ బహుమతి రూ.10వేలు, మిట్స్ కళాశాలకు చెందిన బాలాజీ 5వ బహుమతి రూ.5వేలు బహుమతులను సాధించడంతో పాటుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను కరెస్పాండెంట్ ఎస్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపాల్ సి.యువరాజ్ అభినందించారు.

అదుపుతప్పి ద్విచక్ర వాహనం బోల్తా

- ఇరువురికి గాయాలు

సిద్దవటం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భాకరాపేట సమీపంలో ఏపీఎస్పీ 11వ పోలీసు బెటాలియన్ మూడో గేటు వద్ద సోమవారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తాపడిన ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు... కమ్మపాలెం ఎస్సీ కాలనీకి చెందిన ఎం.సుశాంత్, కల్లూరి కల్యాణి కడపలోని కళాశాలకు సోమవారం స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. బెటాలియన్ మూడో గేటు వద్దకు రాగానే బెటాలియన్ నుంచి ఒక విద్యార్థి సైకిల్‌పై బయటకు వచ్చాడు. అతన్ని తప్పించబోయి అదుపు తప్పి రోడ్డుపక్కనే ఉన్న అరుగును ఢీకొని బోల్తాపడ్డాడు. ఈ ప్రమాదంలో సుశాంత్‌కు రెండు కాళ్లు విరగ్గా, కల్యాణి తలకు గాయాలయ్యాయని, వారిని కడప ప్రైవేటు వైద్యశాలకు తరలించాలని స్థానికులు తెలియజేశారు. జరిగిన ఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఉచితం

- పీలేరు ఎంఈవో లోకేశ్వర్‌రెడ్డి

పీలేరురూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం 2009 సెక్షన్ 12(1)(సి) ప్రకారం 2025-26 విద్యాసంవత్సరానికి 1వ తరగతిలో ఉచిత అడ్మిషన్ పొందవచ్చని పీలేరు ఎంఈవో లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన పీలేరు ఎమ్మార్సీ కార్యాలయంలో మాట్లాడుతూ విద్యార్థులు వారి నివాస సమీప ప్రాంతంలో (సీబీఎస్‌ఈ, ఐసీఎల్‌ఈ, ఐబీ, స్టేట్ సిలబస్‌ను అనుసరిస్తున్న) అన్ని ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయించినట్లు తెలిపారు.

ఎవరు అర్హులు...

అనాథ పిల్లలు, హెచ్‌ఐవీ బాధితులు, దివ్యాంగులు, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, బీసీ, మైనార్టీ, అల్పాదాయం కలిగిన ఓసీలు.

అర్హత వయసు...

సీబీఎస్‌ఈ, ఐసీఎల్‌ఈ, ఐబీ సిలబస్‌ను అనుసరిస్తున్న పాఠశాలల్లో ప్రవేశం కోసం ఏప్రిల్ 1, 2018 నుంచి మార్చి 31, 2019 మధ్య జన్మించి ఆరేళ్ల వయసు నిండిన చిన్నారులై ఉండాలి. రాష్ట్ర సిలబస్‌ను అను సరిస్తున్న పాఠశాలల్లో ప్రవేశం కోసం జూన్ 1, 2019 నుంచి మే 31, 2020 మధ్య కాలంలో పుట్టి ఐదు సంవత్సరాలు వయసు నిండి ఉండాలి.

ఎవరెవరికి ఎంత శాతం

ఆరు అంచెల నిర్ధారణ ద్వారా ధ్రువీకరించబడిన విద్యార్థులలో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న వర్గాలు (అనాథ పిల్లలు, హెచ్‌ఐవీ, దివ్యాంగులు) 5 శాతం. షెడ్యూల్ కులాలు 10 శాతం, షెడ్యూల్ తెగలు 4 శాతం, బలహీన వర్గాలకు చెందిన బీసీ, మైనారిటీ ఓసీ గ్రామీణ ప్రాంత కుటుంబాలకు సంవత్సర ఆదాయం రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.40 లక్షలు ఉండే పిల్లలకు 6 శాతం సీట్లు కేటాయించారు.

దరఖాస్తు కోసం...

చిరునామా ధ్రువీకరణ కోసం తల్లిదండ్రుల ఆధార్‌కార్డ్, ఓటరు ఐడీ, రేషన్‌కార్డు, భూయాజమాన్య పత్రం, ఉపాధి హామీ జాబ్‌కార్డు, పాస్‌పోర్ట్, విద్యుత్ బిల్లు ఏదైనా ఉంటే సరిపోతుంది. అలాగే పిల్లల వయసు ధ్రువీకరణ పత్రం ఉండాలి. మే 2 నుంచి 19వ తేది లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ అవకాశాన్ని అర్హులైన పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో కోరారు.

> **ప్రైవేట్ స్కూళ్లకు దరఖాస్తు గడువు పొడిగింపు**
>
> కలికిరి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కొన్ని రిజర్వ్‌డ్ కేటగిరీలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వ గుర్తింపు పొందిన అన్ ఎయిడెడ్ ప్రైవేటు పాఠశాలల్లో అడ్మిషన్లు పొందడం కోసం దరఖాస్తులు పంపుకోవడానికి గడువు పొడిగించారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. విద్యా హక్కు చట్టం మేరకు ప్రతి ప్రైవేటు పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ విద్యార్థులకు ఒకటవ తరగతిలో 25 శాతం సీట్లను రిజర్వ్ చేశారు. ఈ వర్గాలకు చెందిన అర్హులైన విద్యార్థులకు ఈ 25 శాతం కోటాలో ఉచితంగా ప్రవేశాలు కల్పిస్తారు. మే 2 నుంచి 19వ తేదీలోగా దరఖాస్తులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. 29న మొదటి రౌండు లాటరీ ద్వారా ఎంపికైన అభ్యర్థుల ఫలితాలను ప్రకటించనున్నారు. జూన్ 8 నాటికి ఆయా పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపికైన అభ్యర్థులకు సంబంధించిన యాజమాన్యాలు ప్రవేశాలను ఖరారు చేయనున్నారు. ఆ తరువాత మిగిలిన సీట్ల కోసం రెండో రౌండు లాటరీని జూన్ 11న నిర్వహిస్తారు. వీరికి సంబంధించిన ప్రవేశాలను 18వ తేదీలోగా పాఠశాలల యాజమాన్యాలు నిర్ధారించాల్సి వుంది. కొత్త షెడ్యూలు మేరకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు పంపుకోవాలని కలికిరి ఎంఈవో కరీముల్లా సూచించారు.

వేడుకగా వీరభద్రుడి పల్లకీ ఉత్సవం



వీరభద్రాలయంలో పల్లకీ ఉత్సవాన్ని నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

రాయచోటిటౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం స్వామి, అమ్మవార్ల పల్లకీ ఉత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాములు వేదమంత్రాల మధ్య వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి బ్యాండు మేళాలతో ఆలయం చుట్టూ మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ భక్తులతో పాటు కన్నడ భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌పై నేడు విచారణ

- విచారణ అధికారిగా ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మీ

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎంవీ ప్రభాకర్‌రావుపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ చేపట్టేందుకు ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మిని విచారణ అధికారిగా కలెక్టర్ శ్రీధర్ నియమించారు. జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, సాల్మన్ మరో ఇద్దరు వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారించి నివేదిక సమర్పించడానికి శ్రీలక్ష్మిని నియమించినట్లు ఆమె తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని డీ బ్లాక్‌లో ఉన్న ఐసీడీఎస్ కార్యాలయంలో విచారణ చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. ప్రభాకర్‌రావుపై ఆధారాలతో కూడిన సాక్ష్యాలు నేరుగా తీసుకురావాలని 29వ తేది మంగళవారం ఉదయం, మధ్యాహ్నం వేర్వేరుగా అందరినీ విచారిస్తారని తెలిపారు. విచారణలో వాంగ్మూలాలు రికార్డు చేసి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు.

మైనారిటీలకు సబ్సిడీ రుణాలు

కడప ఎస్టీఆర్‌సర్కిల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీ వర్గాలకు సబ్సిడీ రుణాలు మజూరు చేయనున్నట్లు మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రుణాలకు దరఖాస్తు చేసుకునేందుకు మే 25వ తేదీ తుది గడువుగా పేర్కొన్నారు. ముస్లిం మైనారిటీలకు రూ.లక్ష నుంచి రూ.6లక్షల వరకు, క్రిస్టియన్ మైనారిటీలకు రూ.లక్షల నుంచి రూ.8లక్షల వరకు రుణాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి 50శాతం సబ్సిడీ మంజూరు అవుతుందని వివరించారు. మరిన్ని వివరాలకు ఈడీ మైనార్టీ కార్పొరేషన్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

757 పశువులకు నీటితొట్టెలు మంజూరు

కడపరూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వేసవిలో పశువుల దాహార్తిని తీర్చేందుకు జిల్లాకు 757 పశువుల నీటితొట్టెలను ప్రభుత్వం మంజూరు చేసిందని డ్వామా పీడీ శేషారెడ్డి తెలిపారు. మంజూరైన నీటితొట్టెలను ఉపాధిహామీ పథకం నిధుల ద్వారా నిర్మిస్తున్నామని వివరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నీటితొట్టెలను పశువులు నడిచే రహదారి పక్కన నిర్మిస్తున్నామని దాదాపు వాటి నిర్మాణం పూర్తి అవుతోందని తెలిపారు. పశువుల నీటితొట్టెలలో నీటిని నింపేందుకు స్థానిక గ్రామ పంచాయతి తగిన ఏర్పాట్లు చేపట్టారని పేర్కొన్నారు.

వంకపోరంబోకులో అక్రమ నిర్మాణాలు

- ఆక్రమణదారులపై పోలీసులకు ఫిర్యాదు



ఆక్రమణలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులికల్లు గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలోని మెయిన్ రోడ్డుకు ఆనుకుని వంకపోరంబోకు స్థలంలో గత వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి అక్రమ నిర్మాణాలు నిర్మిస్తున్నారు. అయితే ఆ నిర్మాణాలను గతంలో రెవెన్యూ అధికారులు నిలిపేశారు. కాగా ఆ వంకపోరంబోకు స్థలంలో తిరిగి నిర్మాణాన్ని ప్రారంభిస్తున్నట్లు స్థానిక వీఆర్వోకు గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో ఆదివారం అక్కడికి చేరుకుని నిర్మాణాన్ని ఆపేయాలని తేల్చి చెప్పారు. వారు వినకపోవడంతో తహసీల్దార్, పోలీసుల సహాయంతో పులికల్లు గ్రామంలో వంకపోరంబోకులో నిర్మిస్తున్న నిర్మాణాలను పరిశీలించారు. వాటిని వెంటనే ఆపాలని, కూల్చివేస్తామని తహసీల్దార్ తెలిపారు. గ్రామంలో ఎవరైనా ప్రభుత్వ భూములలో అక్రమంగా నిర్మిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రెవెన్యూ యంత్రాంగం విఫలం

- బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు మణి

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లి మండలం బాలిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవడంలో రెవెన్యూ యంత్రాంగం విఫలమైనట్లు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) జిల్లా అధ్యక్షుడు కామ్రేడ్ పందుగోలమణి ఆరోపించారు. ఈ మేరకు నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి, చిన్నయ్యలతో కలిసి సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ వై.కోట పొలం సర్వే నెంబర్ 1155లో దాదాపు 150 ఎకరాల ప్రభుత్వ బంజరు భూములను భూకబ్జాదారులు, పెత్తందారులు ఆక్రమించి దొంగ ఆన్‌లైన్ చేసుకొని బ్యాంకుల ద్వారా లక్షల రూపాయలు రుణాలు పొందారని, వారిపై తక్షణమే కేసులు పెట్టి పెత్తందారులు స్వాధీనంలో ఉన్న ప్రభుత్వ, బంజరు భూములను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో ఉన్న కూటమి పార్టీకి చెందిన రాజకీయ నాయకులకు, భూకబ్జాదారులకు, పెత్తందారులకు రెవెన్యూ అధికారులు కొమ్ముగాస్తూ రూ.కోట్ల విలువ చేసే భూములను వారికి కట్టబెట్టి లక్షల రూపాయలు దండుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ భూములు రెవెన్యూ పోలీసులు స్వాధీనం పరుచుకొని నిరుపేదలకు పంచాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చింతలపూడి నాగమ్మ, జయరామయ్య, మల్లిక, వెంకట్రమణ, కె.వెంకట్రమణ, కె.రవి, మణి, రమణ, నరసింహారెడ్డి, హరి పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైల్వేకోడూరు వాసులు



కేఫ్‌లో అగ్నిప్రమాదం

● విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు ● రూ.4లక్షల ఆస్తి నష్టం

కడప క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కడప నగరం చిన్నచౌకు మద్రాసు రోడ్డులోని హోండా షోరూం ఎదురుగా ఉన్న బీఆర్ కేఫ్‌లో సోమవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. పాత కాలం పద్ధతి మాదిరి రూముపై తడికెలు వేసి దానిపై బోద కప్పి పెట్టడంతో మంటలు వేగంగా వ్యాప్తి చెందాయి. ఆ రూములో ఉన్న ఫర్నీచర్‌తో పాటు ఫ్యాన్లు, కేఫ్‌కు సంబంధించిన సామగ్రి కాలి బూడిద అయింది. కడపకు చెందిన రామచంద్రనాయుడు ఈ కేఫ్ నిర్వహిస్తున్నాడు. అయితే పదిరోజుల క్రితం ఖాళీ చేసి బాడుగకు ఇవ్వాలనుకున్నాడు. ఈ క్రమంలోనే సోమవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు రేగి వస్తువులన్నీ కాలిపోయాయి. ఈ ప్రమాదంలో దాదాపు రూ.4లక్షల మేర ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఫైర్ అధికారులు తెలిపారు.

మోటరు, పైపుల కాల్చివేత.. పోలీసులకు ఫిర్యాదు

చెన్నూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుగ్గనపల్లెలో అల్లూరు వెంకటసుబ్బయ్య అనే వ్యక్తి వ్యవసాయ పొలానికి సంబంధించిన మోటరు, పైపులు కాలిపోయాయని, ఎవరైనా కాల్చివేశారా, ఆకతాయి పనో అర్థం కావడం లేదని స్థానిక సీఐ క్రిష్ణారెడ్డికి సోమవారం ఫిర్యాదు చేశారు. పైపులు టీవీసీవీ కావడంతో పూర్తిగా కాలిపోయిందని, అలాగే మోటరు సైతం కాలిపోయిదని, దీంతో రూ.లక్షకు పైగా నష్టం కలిగిందని వాపోయాడు. పైపులు కాలే సమయంలో మోటరుకు విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన కేబుల్ కూడా పూర్తిగా కాలిపోయిందని ఆయన తెలిపారు. కాగా ఇటీవల చెన్నూరులో స్వామి కంప్యూటర్స్ యజమాని కోడూరు రాజయ్యస్వామికి సంబంధించిన కారు, కొండపేటలో ఓ రైతుకు చెందిన తమలపాకు తోటకు కూడా ఎవరో ఆకతాయిలు అగ్గిపెట్టడంతో కాలిపోయాయి. ఇవి ఆకతాయిలు చేసిన పనా.. లేక ఇంకెవరైనా చేస్తున్నారా అని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

స్పెషల్ డ్రైవ్‌లో 42వాహనాలు సీజ్


సీజ్ చేసిన వాహనాలతో పోలీసులు

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల ప్రకాష్‌నగర్‌లో సోమవారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ తనిఖీల్లో మొత్తం 42వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ నరేష్‌బాబు తెలిపారు. ఇటీవల కశ్మీర్‌లో జరిగిన సంఘటనలను దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారుల ఆదేశాలతో ఈ తనిఖీ చేసినట్లు సమాచారం. ఈ తనిఖీల్లో ఎర్రగుంట్ల సీఐ నరేష్‌బాబు, కొండాపురం సీఐ రఫీ, ముద్దనూరు సీఐ, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. ఇంటింటిని జల్లెడ పట్టారు. ప్రజలతో మాట్లాడారు. అలాగే పలు సూచనలిచ్చారు. ముఖ్యంగా కొత్తవారి విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని స్థానికులకు సూచించారు. ఈ సోదాల్లో సరైనా డాక్యుమెంట్లు లేని 41మోటార్ సైకిళ్లను, ఒక ఆటోను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


మృతి చెందిన రైతు రఘు (ఫైల్)

వీరపునాయునిపల్లె, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో మండలంలోని వెల్లుర్తి గ్రామానికి చెందిన మాతిగాళ్ల రఘు(45) సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తనకున్న 1.50ఎకరాల పొలంలో పంట సాగుచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ముగ్గురు కుమార్తెలకు వివాహం చేశాడు. ఈ క్రమంలో అప్పులు ఎక్కువై తీర్చే దారి తెలియక తనువు చాలించాడు. తోట వద్దకు వెళ్తున్నానని చెప్పి గంగమ్మ గుడి వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు.

మట్టిని తరలిస్తున్న టిప్పర్ సీజ్

పెండ్లిమర్రి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఎగువచెరువు నుండి అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఒక టిప్పర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ మధుసూదన్ రెడ్డి తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం టిప్పర్‌ను తహసీల్దార్ కార్యాలయానికి పంపించడం జరిగిందన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న పోలీసులు

పెండ్లిమర్రి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండ్రోజుల్లో జరగనున్న బాల్యవివాహాన్ని సోమవారం అడ్డుకున్నట్లు ఎస్ఐ మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయల్ 100 ద్వారా రాబడిన సమాచారం మేరకు విచారణ చేయగా సదరు వధువు వివాహ వయస్సు పూర్తి కాలేదని తెలుసుకుని ఇరువైపుల పెద్దలను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం తహశిల్దార్ వద్ద బైండోవర్ చేసినట్లు ఆయన తెలిపారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు అధ్వానం : తులసిరెడ్డి

వేంపల్లె, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతిభద్రతలు అధ్వానంగా ఉన్నాయని మాజీ రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి విరుచుకుపడ్డారు. వేంపల్లెలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆడవాళ్లకు, మగవాళ్లకు, హిజ్రాలకు ఎవరికి రక్షణ లేదన్నారు. వేటకొడవళ్లు వీరవిహారం చేస్తున్నాయన్నారు. మద్యం, డ్రగ్స్, గంజాయి, జూదం, బెట్టింగ్‌లు విచ్చలవిడిగా సాగుతున్నాయన్నారు. నిన్న ఆదివారం పట్టపగలు కర్నూలు జిల్లా ఆలూరు అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త, మాజీ జడ్పీటీసీ సభ్యుడు చిప్పగిరి లక్ష్మీనారాయణను టిప్పర్‌తో ఢీకొట్టి వేట కొడవళ్లతో నరికి చంపారన్నారు. ఏప్రిల్ 22న టీడీపీనేత వీరయ్యచౌదరిని ప్రత్యర్థులు చంపారని, మార్చి 11న ఒక ఎస్ఐని ఓ యువకుడు మద్యం మత్తులో జుట్టుపట్టుకొని లాగాడన్నారు. మద్యం మత్తులో తండ్రిని రంపంతో కోసి చంపాడొకడు, ఇంకొకడు భార్య, కూతురిని నరికి చంపాడన్నారు. ఇంకో చోట కళ్లలో కారం చల్లి వేట కొడవళ్లతో నరికి చంపారన్నారు. ఇలా చెప్పుకొంటూపోతే కొండవీటి చాంతాడు అవుతుందని, నేర చరిత్ర గల ఎమ్మెల్యేలలో ఏపీ నెంబర్ వన్ స్థానంలో ఉందన్నారు.

డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు

కడప క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కడప నగర వైవీ స్ట్రీట్, బీకేయం స్ట్రీట్‌లలో సోమవారం రాత్రి పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు పెహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. లగేజీలను పరిశీలించారు. వైవీ స్ట్రీట్, బీకేయం స్ట్రీట్ వ్యాపార ప్రాంతాలు కావడంతో ఇక్కడ జనాల రాకపోకలు రద్దీగా ఉంటుంది. ఈ నేపథ్యంలో పోలీసులు పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు.


లగేజీని పరిశీలిస్తున్న డాగ్ స్క్వాడ్ బృందం

ఏకసంథాగ్రాహి..



● ఒకసారి వింటే చాలు..
● అనర్గళంగా ఇంగ్లీష్, తెలుగు పాఠ్యాంశాలను అప్పజెబుతున్న విద్యార్థి
● పేజీ నంబర్ చెబితే పాఠ్యాంశమంతా వివరణ ● చెస్‌లోనూ ప్రతిభ చూపుతున్న బాలుడు
● ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న మట్టిలో మాణిక్యం.. వెంకటవినయ్

వేంపల్లె, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఈ బాలుడు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న సాధారణ విద్యార్థి. తల్లిదండ్రులూ చదువుకోలేదు. కూలినాలి చేసుకొని జీవించే కుటుంబం. కానీ ఆ విద్యార్థి ప్రతిభ తరగతికి మించి ఉంటుంది. సాధారణంగా తరగతిలోని పాఠ్యాంశాల్లో ప్రశ్నకు జవాబులు నేర్చుకుంటారు. కానీ ఆ పాఠ్యాంశాల్లోని ప్రతి అక్షరాన్ని మెదడులో ఉంచుకోలిగిన మేధస్సు ఈ బాలుడిలో ఉంది. పేజీ నెంబర్ చెబితే చాలు అందులో ఉన్న పాఠ్యాంశాన్ని చూడకుండా చెప్పగలిగే ప్రతిభావంతుడు. చదువుతో పాటు ఆటల్లోను తన ప్రతిభ చూపుతున్నాడు. చెస్‌లో పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయుడిపైనే గెలిచే సత్తా సాధించాడు. ఇది వేంపల్లెలోని శ్రీరామ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న వలసగారి వెంకటవినయ్ ప్రతిభకు తార్కానం. పిట్ట కొంచెం.. కూత ఘనం నానుడికి చక్కగా సరిపోయే రూపం వెంకటవినయ్. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతి అందిస్తున్న ప్రత్యేక కథనం..

వయస్సుకు మించిన ప్రతిభ

వేంపల్లె శ్రీరామ్‌నగర్‌కు చెందిన శ్రీనివాసులు, గంగాదేవి కుమారుడు వలసగారి వెంకటవినయ్. అక్కడి ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. తమ్ముడు జగదీష్ మూడో తరగతి చదువుతున్నాడు. తండ్రి బేల్దారి కూలి కాగా తల్లి ల్యాండ్రీ చేసి జీవించే కుటుంబం. వెంకటవినయ్ ప్రతిభను అక్కడ ఉపాధ్యాయుడిగా పనిచేసే రమేష్ గుర్తించారు. మొదట పాఠం చెప్పిన వెంటనే నేర్చుకొని అప్పజెప్పేవాడు. ఆ బాలుడిపై ప్రత్యేక దృష్టిసారించి మరింత లోతుగా బోధన చేయడంతో ఇంగ్లీష్‌లోని 8పాఠ్యాంశాలను, తెలుగులోని 10 పాఠ్యాంశాలను అనర్గళంగా చెప్పగలిగేంత స్థాయికి చేరుకున్నాడు. మిగతా విద్యార్థులందరు అందులోని ప్రశ్నలకు జవాబులు చెబుతుండగా, వెంటకవినయ్ తన వయసుకు మించి ప్రతిభ చూపుతున్నాడు. పుస్తకాల్లోని పేజీ నెంబర్ చెబితే చాలు.. అందులో ఉన్న పాఠ్యాంశాన్ని చూడకుండా చెప్పగలుగుతున్నాడు. ఇక చేతిరాతను అందంగా రాస్తున్నాడు. చదువుతో పాటు ఆటల్లో కూడా చురుగ్గా రాణిస్తున్నాడు. ప్రధానంగా చెస్‌లో అక్కడ పనిచేసే ఉపాధ్యాయులతో పోటీపడి గెలవగలిగే సత్తా తెచ్చుకున్నాడు.

పేదరికం అడ్డుకారాదు

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న వలసగారి వెంకటవినయ్ ఎంతో ప్రతిభావంతుడుగా ఉన్నాడు. ఈ ప్రతిభ ఇలాగే కొనసాగాలంటే పైచదువులకు వెళ్లేసరికి ఆర్థికభారం పడుతుంది. అతని కుటుంబం పేద కుటుంబం కాబట్టి దాతలు ముందుకొచ్చి చదువుకునేందుకు చేయూతనిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నది ఇక్కడి ఉపాధ్యాయుల ఆకాంక్ష. మట్టిలో మాణిక్యం లాంటి ఈ విద్యార్థికి మంచి భవిష్యత్తు అందాలని ఆకాంక్షిద్దాం.



కలెక్టర్ కావడమే లక్ష్యం..

నాపేరు వలసగారి వెంకటవినయ్. శ్రీరామ్ నగర్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాను. ఉపాధ్యాయుల సహకారంతో పాఠ్యాంశాల్లో ఎక్కడి నుంచైనా చెప్పగలను. భవిష్యత్తులో కలెక్టరై దేశానికి సేవ చేయడమే నా లక్ష్యం.

ప్రత్యేక దృష్టితో బోధన చేశాం..



చెప్పిన పాఠాలు చెప్పినట్లే వెంటనే అప్పజెప్పేవాడు. నాల్గో తరగతి వరకు ఇలా బోధన సాగింది. ఐదో తరగతిలో ప్రత్యేక దృష్టి సారించి విద్యాబుద్ధులు నేర్పించాం. తెలుగు, ఇంగ్లీష్ పాఠ్యాంశాలన్నీ చూడకుండా చెప్పగలుగుతున్నాడు. చెస్‌లోనూ రాణిస్తున్నాడు. ఈ విద్యార్థి చదువు ఇలాగే కొనసాగితే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుంది.

- రమేష్, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు, శ్రీరామ్‌నగర్, వేంపల్లె

పాస్టర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుంది

● టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి



పాస్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పాస్టర్ల సమస్యలను ప్రభుత్వం తప్పకుండా పరిష్కరిస్తుందని, తాను కూడా జిల్లాలోని పాస్టర్ల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి దేవగుడి భూపేశ్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో పాస్టర్లకు గౌరవవేతనం అందించినందుకు సోమవారం జమ్మలమడుగులో రాష్ట్ర క్రిస్టియన్‌సెల్ అధ్యక్షుడు స్వామిదాసు, ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌సీఎం చర్చిలో థ్యాంక్యూ సీఎం సార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో మంచి పాలన అందించే దిశగా ముందుకు సాగుతున్నారన్నారు. అందులో భాగంగా పేద వారికి పట్టణాల్లో ఆహారం సమస్య రాకుండా అన్నా క్యాంటిన్లు ఏర్పాటు చేశారని, అలాగే ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారన్నారు. పాస్టర్ల సమస్యలను క్రిస్టియన్‌సెల్ ఆధ్వర్యంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పాస్టర్లకు గౌరవ వేతనం ఏడు నెలలకు రూ.35 వేలు అందించారని క్రిస్టియన్‌సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, బిర్రు సంతోష్, రైతు విభాగం జిల్లా కార్యదర్శి పొన్నతోట మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

భావన టౌన్‌షిప్ భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలి


మాట్లాడుతున్న రవిశంకర్‌రెడ్డి

● ఆర్‌సీపీ రాష్ట్రకార్యదర్శి రవిశంకర్‌రెడ్డి

కడప మారుతీనగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): భావన టౌన్‌షిప్ భూముల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయని, ఇందులో ప్రభుత్వ భూమి ఉందని, దీని విలువ సుమారు రూ.200 కోట్లకు పైగా ఉంటుందని, వెంటనే ఆ భూములను స్వాధీనం చేసుకోవాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ (ఆర్‌సీపీ) రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వందల కోట్ల రూపాయల ప్రభుత్వ ఆస్తిని చెరపట్టిన నాటి సీకేదిన్నె తహసీల్దారు, ఎస్ఐ, వీరికి సహకరించిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వైసీపీ హయాంలో తప్పుడు పత్రాలు సృష్టించి అక్రమాలు చేయించిన మాజీ ఎమ్మెల్యే రవిరెడ్డి, ఆయన అనుచరులైన గుమ్మా రాజేందర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి తదితరులను శిక్షించాలని డిమాండ్ చేశారు. మూలవంక, ఊటుకూరు రింగు రోడ్డు పరిసరప్రాంతాల్లో మరో 400కు పైగా ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైందని, రానున్న రోజుల్లో వాటిపై కూడా పూర్తి ఆధారాలతో మరో సుదీర్ఘ పోరాటానికి ఆర్‌సీపీ సన్నద్ధమవుతోందన్నారు. కార్యక్రమంలో ఆర్సీపీ రాష్ట్ర కార్యదర్శి సిద్ధిరామయ్య, నగర కార్యదర్శి మగ్బూల్‌బాషా, కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రసాద్, సుబ్బరాయుడు, రమేశ్ పాల్గొన్నారు.


పకడ్బందీగా పాలీసెట్

● ఏర్పాట్లు పూర్తి ● పాలీసెట్ కోఆర్డినేటర్, ప్రిన్సిపాల్ జ్యోతి


విలేకరులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జ్యోతి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాలీసెట్‌ను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పాలీసెట్ కోఆర్డినేటర్, ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. సోమవారం నగరంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి ఈనెల 30వ తేదీన నిర్వహించనున్న పాలీసెట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఇందేరే సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఉంటుందన్నారు. ఉదయం 10గంటలకే పరీక్షకేంద్రం వద్ద ఉండాలన్నారు. కడపతో పాటు ప్రొద్దుటూరు ప్రాంతంలో ఈ పరీక్ష ఉంటుందన్నారు. ఇప్పటికే విద్యార్థులకు హాల్ టికెట్లు జారీ అయ్యాయని, హాల్‌టికెట్ అందనివారు 29వ తేదీ మధ్యాహ్నంలోగా తమ కళాశాలలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కోఆర్డినేటర్ దామోదరం పాల్గొన్నారు.

రేపు డయల్ యువర్ ఆర్‌ఎం




కడప మారుతీనగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రజాసేవలో తరిస్తున్న ఏపీఎస్‌ఆర్టీసీ బస్సుల వల్ల కానీ, సంబంధిత ఉద్యోగుల వల్ల కానీ ఏదైనా సమస్యలుంటే వాటిని నివృత్తి చేసుకునేందుకు వీలుగా ఈనెల 30వ తేదీన డయల్ యువర్ ఆర్‌ఎం కార్య క్రమం నిర్వహిస్తున్నట్లు కడప రీజనల్ మేనేజరు పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. సాయంత్రం 4.30 నుండి 5.30 వరకు ఈ కార్యక్రమం ఉంటుందని, ఆర్టీసీ సమస్యలపై సూచనలు, సలహాలు ఇవ్వవచ్చన్నారు. జిల్లాలోని ప్రజలు, ప్రయాణికు లు 9959225848 నెంబరుకు ఫోన్ చేయాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రారంభమైన వైవీయూ డిగ్రీ పరీక్షలు

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వైవీయూ పరిధిలోని డిగ్రీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు జిల్లాలో 55 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 25892 మంది విద్యార్థులు సోమవారం బీఏ, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ, బీకాం, బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్ 2,4,6 సెమిస్టర్ల పరీక్షలు ప్రారంభమయ్యాయి. కడపలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల, స్పిరిట్స్ డిగ్రీ కళాశాల కేంద్రాలను వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, వైవీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కేఎస్వీ కృష్ణారావు తనిఖీ చేసి హాల్‌టికెట్లను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రిన్సిపాళ్లకు సూచించారు. పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కేఎస్వీ కృష్ణారావు మాట్లాడుతూ ఈ పరీక్షలు మే 24వ తేదీ వరకు ఉంటాయని, ప్రతి పరీక్ష కేంద్రానికి అబ్జర్వర్లను నియమించాలని, అదనంగా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తాయన్నారు.

ఇరువురు బాలుర మిస్సింగ్



మిస్సింగ్ అయిన దర్శన్, లక్ష్మణ్

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం ఆర్ట్స్ కాలేజీ రోడ్డుకు చెందిని ఇద్దరు బాలురు ఆదివారం రాత్రి నుంచి కనుబడటం లేదని వారి తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో సోమవారం పిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సంబటూరు వెంకట దర్శన్ (16) గవర్నమెంట్ బాయిస్ హైస్కూల్లో పదో వతరగతి చదివాడు. ఇటీవలె వచ్చిన పదోతరగతి పరీక్షా ఫలితాల్లో ఫెయిల్ అయ్యాడు. ఆదివారం ఉదయం ఇంట్లో వున్న రూ.500 కనపడకపోవడంతో తండ్రి మందలించాడు. దీంతో దర్శన్ తన చిన్నాన్న ఇంటికి వెళ్లి చిన్నాన్న కొడుకు లక్ష్మణ్ (11) తో కలిసి వెళ్లిపోయాడని తెలిపారు. ఇద్దరూ ఇంటికి రాకపోవడంతో వెతకడం ప్రారంభించామని, ఎంతకీ ఆచూకీ తెలియకపోవడంతో సోమవారం పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

అగ్నివీర్‌కు దరఖాస్తు చేసుకోండి

కడప నాగరాజుపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో అగ్నివీర్, వాయు నియామకం కోసం యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్టెప్ సీఈవో సాయిగ్రేస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.అగ్నిపథ్‌వాయు.సీడీఏసీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. మే 11వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రభావవంతమైన తరగతి గదికి కమ్యూనికేషన్ ప్రధానం

● వైవీయూ వీసీ శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆంగ్లభాషలో చక్కటి కమ్యూనికేషన్ నైపుణ్యాలతో అధ్యాపకులు తరగతులను ప్రభావవంతంగా నిర్వహించగలరని వైవీయూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు అన్నారు. సోమవారం వైవీయూ ఎఫెక్టివ్ క్లాస్ కమ్యూనికేషన్ ఫర్ టీచింగ్ కమ్యూనిటీ అంశంపై అంతర్జాల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సబ్జెక్టు, నాలెడ్జి, లోతైన పరిశోధన, జ్ఞానం, ఆంగ్లంలో చక్కటి భావవ్యక్తీకరణ నేటి గురువులకు అవసరమన్నారు. వైవీయూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫసర్ పుత్తా పద్మ మాట్లాడుతూ ఆంగ్లభాషలో భావవ్యక్తీకరణ విస్తృత అవకాశాలు కలిగిస్తుందన్నారు. ఆచార్య ఎ.రామచంద్రారెడ్డి, సహ ఆచార్యులు డాక్టర్ టి.చంద్రశేఖర్, డాక్టర్ జయంత్ కశ్యప్, ఆచార్య రియాజున్నీసా, ప్రజా సంబంధాల విభాగ సంచాలకులు డాక్టర్ పి.సరిత, డాక్టర్ అనుప్రసన్న, అధ్యాపకులు విద్యార్థులు, స్కాలర్లు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

పులివెందుల రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): 2025-26 అకాడమిక్ సంవత్సరానికి సంబంధించి ప్రైవేటు పాఠశాలల్లో ఆర్టీఈ 2009 ప్రకారం ప్రవేశాలు పొందడానికి దరఖాస్తులు ఈ నెల 28 నుంచి ఆన్‌లైన్‌లో ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారులు-1,2 చంద్రశేఖర్‌రావు, రామానాయుడు తెలిపారు. సోమవారం స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద కరపత్రాలు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ అన్ని ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో 25శాతం సీట్లు కేటాయించడం జరిగిందన్నారు. సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ, ఐబీ సిలబస్ ఉన్న పాఠశాలల్లో ప్రవేశానికి ఏప్రిల్ 2, 2019 నుంచి మార్చి 31,2020 మధ్య జన్మించి ఐదు సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. స్టేట్ సిలబస్‌పాఠశాలల్లో ప్రవేశానికి జూన్ 2, 2019 నుంచి మే 31, 2020 మధ్య జన్మించి ఐదు సంవత్సరాలు నిండిఉండాలన్నారు. నివాసం నుంచి ఒక కిలోమీటర్ దూరంలో ఉన్న ప్రైవేటు పాఠశాలలకు మాత్రమే దరఖాస్తు చేయాలని సూచించారు. వీరికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆ తర్వాత మూడు కిలోమీటర్ల లోపల ఉన్నవారిని కూడా పరిశీలిస్తారని తెలిపారు. ఆర్ఫాన్, హెచ్‌ఐవి, ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వారికి ఐదు శాతం, ఎస్సీలకు పదిశాతం, ఎస్టీలకు నాలుగుశాతం, బలహీన వర్గాలకు చెందిన ఓబీసీ, మైనారిటీ, ఓసీ ఆరుశాతంసీట్లు లభిస్తాయన్నారు. దరఖాస్తు చేయడానికి ఆధార్‌కార్డు, ఓటర్ గుర్తింపుకార్డు, రేషన్‌కార్డు, ఉపాధి హామీ జాబ్‌కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, విద్యుత్ బిల్లు, రెంటల్ అగ్రిమెంట్ కాపీ తదితరవాటిలో ఏదొకటి తప్పకుండా ఉండాలని, పిల్లల వయసు ధ్రువీకరణ పత్రం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు మోహన్, ఉమ తదితరులుపాల్గొన్నారు.

ప్రొఫెసర్స్ కాలనీలో సమస్యల తిష్ఠ..!

- పాడైన రోడ్లు, కాలువలు
- వేధిస్తున్న మురికి నీటి సమస్య
- అవస్థల్లో ప్రజలు
- పట్టించుకోని అధికారులు


మురుగు నీటితో నిండి ఉన్న కాలువ

కడప రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : కడప నగరం 17, 18వ డివిజన్‌ల పరిధిలోని ప్రొఫెసర్స్ కాలనీ సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతోంది. రోడ్లు, డ్రైనేజీ కాలువలు, పారిశుధ్యపు లోపం తదితర కారణాలు ప్రజల పాలిట శాపంగా మారాయి. ఈ గ్రామంలో దాదాపు రెండువేల మంది పైబడి ప్రజలు జీవిస్తున్నారు. కాలనీలో 10కి పైగా వీధులు ఉన్నాయి. ఒకటి, రెండు వీధుల్లో తప్ప మిగిలిన ప్రాంతాలల్లో సిమెంట్ రోడ్లు పగిలిపోయి నెర్రలు చీలి పాడైవున్నాయి. మురుగు కాలువల నిర్మాణం అస్తవ్యస్తంగా ఉంది. అక్కడక్కడా డ్రైనేజీ కాలువలు ఉన్నా అవి పూర్తిగా పూడికతో నిండి పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. దీంతో కాలనీలోని వ్యర్థపు నీరంతా బయటికి వెళ్లడానికి వీలులేకుండా ఎక్కడిది అక్కడే తిష్ఠవేసి ఉంది. దీంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. దుర్గంధం భరించలేక అల్లాడుతున్నారు. మురుగు నీరు నిల్వ కారణంగా దోమలు వీరవిహారం చేస్తున్నాయి. దోమల కాటు వలన ప్రజలు విషజ్వరాల భారిన పడుతున్నారు. కాలనీలో పారిశుధ్యపు పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో చెత్త చెదారం పేరుకుపోయి ఉంది. దీంతో ప్రజలు రోగాలకు దగ్గరవుతున్నారు. తాగునీటికి కూడా అవస్థలు పడుతున్నారు.ఇలా పలురకాల సమస్యలతో ఇబ్బంది పడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ప్రజలు మండిపడుతున్నారు.

సబ్సిడీపై యాంత్రీకరణ పరికరాలు పంపిణీ

చెన్నూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : రైతులకు వ్యవసాయంలో ఉపయోగపడే యాంత్రీకరణ పరికరాలను వ్యవసాయాధికారి శ్రీదేవి సోమవారం పంపిణీ చేశారు. ఇందులో రోటోవేటర్, టిల్లర్ విత్తనపు గొర్రు, 9చక్రాల గొర్రు, బ్యాటరీ స్ప్రేయర్, పవర్ స్ప్రేయర్ సబ్సిడీపై అందించడం జరిగింది. అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాలకు వచ్చి సబ్సిడీపై యాంత్రీకరణ పనిముట్లను తీసుకోవచ్చని తెలిపారు.

'అక్రమ సస్పెన్షన్ తగదు'

కడప మారుతీనగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా ఆర్టీసీలో కింది స్థాయి ఉద్యోగులను అక్రమ సస్పెన్షన్లకు గురి చేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ కడప డిపో కార్యదర్శి సగినాల శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు నిరసనగా ఎన్ఎంయూ కడప డిపో ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్టీసీ కడప డిపో ఎదుట రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. రిలేనిరాహార దీక్షలో కడప డిపో కండక్టర్లు మల్లికార్జున, ఎస్ఎం బాషా ఉన్నారు.

పుష్పగిరి ఉత్సవాలకు ఉచిత వాహనం

చెన్నూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : పుష్పగిరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 30న జరిగే అక్షతదియకు చెన్నూరు, ఖాజీపేట నుంచి ఉచిత వాహన సౌకర్యం ఏర్పాటు చేసినట్లు మండల మండల టీడీపీ సీనియర్ నేత, మానవతా సంస్థ గౌరవాధ్యక్షుడు ఆవుల బసిరెడ్డి తెలిపారు. 30న ఉదయం నుంచి రాత్రి వరకు చెన్నూరు కొత్తరోడ్డు నుంచి పుష్పగిరికి, అలాగే ఖాజీపేట నుంచి పుష్పగిరికి వాహనాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ వాహనాలను ఖాజీపేట బస్టాండు మీదుగా పుష్పగిరికి ఉదయం నుంచి నడుపుతున్నామని, దూర ప్రాంతాల నుంచి వచ్చేవారు ఖాజీపేట వద్ద దిగి వాహనాల్లో ప్రయాణం చేయవచ్చన్నారు. అలాగే కడప నుంచి వచ్చేవారంతా కొత్తరోడ్డు వద్ద దిగి ఉచిత వాహన సౌకర్యం వినియోగించుకోవలన్నారు.

కడప మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా బాలస్వామిరెడ్డి



కడప క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కడప మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీగా బాలస్వామిరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 1995 బ్యాచ్‌కి చెందిన ఈయన ఎస్ఐగా జిల్లాలో పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహించారు. 2007 సీఐగా పదోన్నతి పొంది జిల్లాలో విధులు నిర్వహించారు. 2020లో డీఎస్పీగా పదోన్నతి పొంది తిరుమల ట్రాఫిక్‌కుబదిలీపై వెళ్లారు. అక్కడి నుంచి కడప ట్రాఫిక్ సీసీఎస్‌లలో విధులు నిర్వహించారు. ప్రస్తుతమైన హ్యూమన్ రైట్స్ డీఎస్పీగా పనిచేస్తూ కడప మహిళా పోలీసుస్టేషన్‌కు బదిలీపై వచ్చారు.

వైభవంగా ఇంద్రనాథేశ్వర వార్షిక పూజలు

వల్లూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రుడిచే ప్రతిష్ఠించబడిన ఇంద్రనాథేశ్వర ఆలయంలో వార్షికోత్సవాల సందర్భంగా సోమవారం ఉదయం గోపూజతో నిర్వహించిన అనంతరం గణపతిపూజ, స్వస్తి పుణ్యాహవచనం వేద పండితులు నిర్వహించారు. అనంతరం మంటపారాధన గావించారు. అనంతరం మహానైవేద్యాన్ని స్వామివారికి అర్పణ, మహామంగళహారతి గావించి తీర్థ ప్రసాదాలు అందించారు. సాయంత్రం అంకురార్పణ చేసి అగ్నిప్రతిష్ఠ చేసి దీక్ష హోమాలు నిర్వహించారు. మంగళవారం ఉదయం వివిధ పూజలు, నిత్యహోమాలు నిర్వహించిన అనంతరం శివపార్వతుల కల్యాణం కూడా ఉంటుందని తెలిపారు. అలాగే చింతలపత్తూరులో వెలసిన ఇంద్రనాథేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్నామన్నారు.

వేతనాలు ఇవ్వండి : ఎంపీడీఓకు వినతి



వేంపల్లె, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మొన్నటి వరకు పారిశుధ్యకార్మికులు, నీటి సరఫరా సిబ్బందికి వేతనాలు ఇవ్వకుంటే ఎలా బతకాలి పనులు చేయలేమంటూ అధికారుల ముందు పలుమార్లు వెళ్లబోసుకున్నా వేతనాలు ఇవ్వలేదు. మరోవైపు వేంపల్లె మండలంలో పనిచేస్తున్న సుమారు 70 మంది సచివాలయ సిబ్బందికి వేతనాలు ఇవ్వలేదంటూ ఎంపీడీఓ కుళాయమ్మకు సోమవారం వినతిపత్రం అందించారు.

వాసవీ మాత పాదుకలతో గ్రామోత్సవం



వేంపల్లె, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో పెనుగొండ పరమేశ్వరి దేవి రథయాత్రలో భాగంగా అమ్మవారి పాదుకలను గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటం శెట్టి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మొదట అమ్మవారి పాదుకలకు పాలాభిషేకం చేశారు. అనంతరం పట్టణంలో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు సుబ్బారావు,మహిళా మండలి నాయకురాలు నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష

పులివెందుల రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారంలో నిరసన, రిలే నిరాహార దీక్షలు చేస్తున్న ఆర్టీసీ కార్మికులపై ప్రభుత్వాలు కరుణచూపలేదని ఆర్టీసీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలోని ఏపీఎస్‌ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్ఎంయుఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పీఎస్ఎన్‌రావు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా ప్రమోషన్లు కల్పించలేదని దీని వల్ల వయసు పెరుగుతున్నా ప్రమోషన్లు లేక అనేక మంది ఏళ్లతరబడి కండక్టర్లు, కిందిస్థాయి సిబ్బందిగానే మిగిలిపోతున్నారన్నారు. గతంలో అనారోగ్యబారిన పడితే ధైర్యంగా ఆసుపత్రులకు వెళ్లేవారమన్నారు. ఇపుడు కంటి, పంటికి తప్ప మిగిలిన వాటికి వైద్యం చేయించుకోలేకపోతున్నామన్నారు.ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని తదితర డిమాండ్లతో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో డిపో చైర్మన్ జేవీ రమణ, సీసీఎస్ డెలిగేట్ రామలింగారెడ్డి, రీజనల్ కమిటీ మెంబర్ ఈశ్వరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఎంరెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పెద్దచెప్పలి ఎల్లమ్మ తిరునాళ్లు


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి

కమలాపురం రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : చెప్పలమ్మ తల్లి వార్షిక బ్రహ్మోత్సవాలల్లో భాగంగా పెద్దచెప్పలిలో వెలసిన ఎల్లమ్మతల్లి తిరునాళ్ల సందర్భంగా సోమవారం ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి బంగారు చీర అలంకరించారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి ఎల్లమ్మతల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

బండలాగుడు పోటీలు ప్రారంభించిన ఎమ్మెల్యే..: సోమవారం నిర్వహించిన బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ తోట రవీంద్ర కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను పూలమాలతో శాలువాతో సత్కరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. రాత్రికి సత్యహరిశ్చంద్ర నాటకం భక్తులను ఆకట్టుకుంది. కాగా సాయంత్రం కమలాపురం నగర పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన బీసీ మహిళల కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి ప్రారంభించారు.

హైవేలో ప్రమాదాల నివారణకు హెచ్చరికలు డిస్‌ప్లే



మద్యం తాగి వాహనం నడపరాదన్న హెచ్చరికబోర్డు



చెన్నూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు కొత్తరోడ్డు హైవే రహదారి మీదుగా రాకపోకలు సాగించేవారు ప్రమాదాల బారిన పడకుండా కేంద్రప్రభుత్వం వినూత్న విధానం ప్రవేశపెట్టింది. ప్రతి మండల కేంద్రంలో ప్రమాదాలు నివారించే సూచిక బోర్డులను డిస్‌ప్లే ద్వారా రహదారిపై ప్రచురి తమవుతున్నాయి.జాగ్రత్తగా వాహనాలు నడ పండి, మద్యంసేవించి వాహనం నడపరాదు, సీటుబెల్టు ధరించండి లాంటి ప్రమాద హెచ్చరికల బోర్డులు డిజిటల్ డిస్‌ప్లే ద్వారా హైవేపై నిమిషానికి ఒకమారు కనిపిస్తుంటాయి.

12వ పీఆర్సీ చైర్మన్‌ను తక్షణం నియమించాలి


మాట్లాడుతున్న కె.సురేష్‌కుమార్

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): 12వ వేతన సవరణ సంఘానికి (పీఆర్సీ) తక్షణమే చైర్మన్‌ను నియమించాలని యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కడప నగరం యూటీఎఫ్ భవన్‌లో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్షణం పీఆర్సీ కమీషన్‌ను నియమిస్తామని, సకాలంలో డీఏలు ఇస్తామని, పెండింగ్ బకాయిలను చెల్లిస్తామని హామీలు గుప్పించి, తీరా అధికారంలోకి వచ్చాక హామీలను విస్మరించారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు బి.లక్ష్మీరాజ, ఎన్.నవకోటేశ్వర రావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు, జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీ హయాంలో బ్రాహ్మణులపై దాడులు జరగలేదా'

వేంపల్లె, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణులపై కూటమి ప్రభుత్వ హయాంలో దాడులు దాష్టీకాలు జరిగాయని వైసీపీ మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించడం హాస్యాస్పదమని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రసాదరావు ఒక ప్రకటనలో ఖండించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో బ్రాహ్మణులపై ఎన్నో దాడులు జరిగాయని తెలిపారు.

బీజేపీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

వేంపల్లె, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్సీ సోము వీర్రాజు తెలిపినట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ తెలిపారు. సోమవారం విజయవాడ బీజేపీరాష్ట్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజును జిల్లా కార్యదర్శి అరకటవేముల హరినారాయణతో కలిసి ఘనంగా సత్కరించారు.

అనాథ వృద్ధులకు అన్నదానం

కడప(వినాయకనగర్), ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎర్రముక్కపల్లిలో ఉన్న నవజీవన్ పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలో సోమవారం కృష్ణపర్‌జార్జి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనాథ వృద్ధులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్‌పర్సన్ కృష్ణవేణి మాట్లాడుతూ తమ ట్రస్ట్ పేదలకు, పేద వృద్ధులకు సేవలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి రమేశ్, సభ్యులు గోపాల్‌రెడ్డి, యల్లయ్య, ఆదినారాయణ, హరిప్రసాద్, నిరాశ్రయుల వసతి గృహం నిర్వాహకులు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా బ్రహ్మోత్సవాలు నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న పోలీసులు

వల్లూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : పుష్పగిరి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం వల్లూరు పోలీసుస్టేషన్‌లో సీఐ రోషన్, ఎస్ఐ పెద్ద ఓబన్నలతో పుష్పగిరి కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. ఈసందర్భంగా సీఐ, ఎస్ఐ మాట్లాడుతూ పుష్పగిరి బ్రహ్మోత్సవాల సందర్భంగా కమిటీ సభ్యులు, ఆలయ ధర్మకర్త, ఈవో అందరూ సమష్టిగా బ్రహ్మోత్సవాలు నిర్వహించాలని తెలిపారు. అలాగే బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే నది వద్ద ఎటువంటి అపాయాలు జరగకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూస్వామివారి దర్శనం జరిగేటట్లుగా చూడాలని తెలిపారు. ముఖ్యంగా 30న అక్షయ తృతీయ సందర్భంగా దేవస్థానంలో కొండమీద, దిగువన శివాలయంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకండా చూడాలన్నారు. బండలాగుడు సమయంలో కూడా భారీ గేట్లు కట్టాలన్నారు. దేవస్థానంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, నది వద్ద తాత్కాలిక షెడ్డులు ఏర్పాటు చేయడం లైట్లను ఏర్పాటు చేయడంలాంటివి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త వెంకటసుబ్బారెడ్డి, ఆలయ ఈవో శ్రీనివాసులు, కమిటీ సభ్యుడు, ఆదినిమ్మాయపల్లె మాజీ ఉపసర్పంచ్ రమణారెడ్డి, నిమ్మకాయల శివశంకర్‌రెడ్డి, చంద్ర, ఆలయ పూజారులు తదితరులు పాల్గొన్నారు.

మానవత సంస్థ సేవలు స్ఫూర్తిదాయకం


మజ్జిగ పంపిణీ చేస్తున్న కమిషనర్

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మానవత సేవా సంస్థ ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తూ మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభించడాన్ని స్వాగతిస్తున్నామని కడప కమిషనర్ మనోజ్‌రెడ్డి తెలిపారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయ సమీపంలో ఏర్పాటుచేసిన మజ్జిగ కేంద్రాన్ని కమిషనర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మానవత సేవా సంస్థ కార్యవర్గ సభ్యులు, నగర ప్రముఖులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

బీసీ కుల గణనచేపట్టి రిజర్వేషన్లు అమలు చేయాలి

కడప నాగరాజుపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా బీసీ కుల గణన చేపట్టి 52శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీయునైటెడ్ నేషన్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు డి.ఎ.ఓబులేసుయాదవ్, ఆంధ్రప్రదేశ్ దళిత మిత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు కైపు రామాంజనేయులు కోరారు. సోమవారం గ్రీవెన్స్‌డేలో డీఆర్వోకు వినతిపత్రం అందించారు.

వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

సీకేదిన్నె, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి ఇబ్రహీం తెలిపారు. చింతకొమ్మదిన్నె శాఖా గ్రంథాలయంలో మంగళవారం నుంచి 6వ తేదీ వరకు నిర్వహించే సమ్మర్‌క్యాంప్‌ను సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. సమ్మర్‌క్యాంప్‌లో భాగంగా బుక్ రివ్యూ, ఆటల పోటీలు, స్పోకన్ ఇంగ్లీషు, బయాలజీ చెప్పించడం జరుగుతుందన్నారు.

సింహాద్రిపురం..: కోవరంగుట్టపల్లి, సింహాద్రిపురం గ్రంథాలయ శాఖల్లో నేటి నుంచి జూన్ 6వ తేదీ వరకు జరిగే వేసవి శిక్షణ తరగతులను (సమ్మర్ క్యాంప్) పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని లైబ్రరీ అధికారులు గంగా దేవి, శేఖర్ తెలిపారు. పిల్లలను వేసవిలో బయట తిరుగకుండా, అతిగా సెల్‌ఫోన్‌లు వినియోగించకుండా, పిల్లలను గ్రంథాలయాలకు పంపించి కథలు చదవటం, చెప్పటం, ఆటపాటలతో పిల్లల్లో నైపుణ్యాన్ని వెలికితీయాలన్నారు.



ఆంధ్రప్రదేశ్ ముఖచిత్రం త్వరలో మార్పు

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఏపీముఖచిత్రం త్వరలో మారబోతోందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ మాధవి తెలిపారు. రూ.50వేలకోట్లతో అమరావతి పునర్నిర్మాణానికి మే2న శంకుస్థాపన కార్యక్రమం జరుగుతుందని ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ హాజరుకానున్నారని స్పష్టం చేశారు. సోమవారం కడపలోని ద్వారకానగర్ తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చంద్రబాబు చిత్తశుద్ధితో చేస్తున్న కృషి కారణంగా రాష్ట్ర ముఖచిత్రం మారబోతోందన్నారు. దేశంలోనే కాదు ప్రపంచంలోనే ఉత్తమ రాజధాని అమరావతి కాబోతోందన్నారు. గత ప్రభుత్వం తప్పిదాలను సరిచేసుకుంటూ మే 2న ప్రధాని చేతులమీదుగా రాజధాని నిర్మాణానికి శంకుస్థాపన చేసుకోబోతున్నామన్నారు. అలాగే కడప అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. ప్రక్షాళన చేస్తున్నట్లు చెప్పారు. సుందరీకరణ పనులు కూడా ప్రారంభించామన్నారు. కడప నుంచి గంజాయిని పూర్తిగా నిర్మూలిస్తామని చెప్పారు. ఎంఎస్ఎంఈ పార్క్ కడపలోనే ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. పది ఎకరాలు ప్రభుత్వం కేటాయించిందని, యువతకు ఉద్యోగ అవకాశాలు లభించే విధంగా కృషిచేస్తున్నామన్నారు.

భూముల రీసర్వేలో సమస్యలు తలెత్తకుండా చూడాలి



సర్వేయర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో సాయిశ్రీ

జమ్మలమడుగు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వేలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ సర్వేయర్లను ఆదేశించారు. స్థాని క ఆర్డీవో కార్యాలయ సభాభవనంలో సోమవారం సాయంత్రం డివిజన్‌స్థాయిలోని సర్వేయర్లకు రీ సర్వేపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీవో సాయిశ్రీ ఒక్కో మండలంలో సర్వేయర్లను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏయే గ్రామాల్లో రీ సర్వేకు సంబందించి సమస్యలు, భూములకు సంబందించిన రైతాంగ ఇబ్బందులు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రీ సర్వేలో ఇబ్బందులను ఆయా గ్రామాల, మండలాల సర్వేయర్లు ఆర్డీవో దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఎప్పటికప్పుడు ఇబ్బందులను తెలియజేయాలని సమస్యలు లేకుండా రీ సర్వే కొనసాగాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌స్థాయిలోని సర్వేయర్లు పాల్గొన్నారు.

ఓ వ్యక్తి ప్రాణాన్ని కాపాడిన పోలీస్

ఖాజీపేట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ మాధవరెడ్డి ఓ వ్యక్తి ప్రాణాన్ని కాపాడి వారి కుటుంబసభ్యులకు అప్పగించిన సంఘటన ఖాజీపేటలో సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే ఆదివారం రాత్రి జమ్మలమడుగు నియోజకవర్గంలోని పెద్దముడియం మండలం గరికనగర్ గ్రామానికి చెందిన జాకోబ్ కుమారులతో ఘర్షణపడి కడపకు వెళుతూ ఖాజీపేటకు రాగానే నాగసానిపల్లె సమీపంలో పురుగుల మందు తాగుతున్నట్లు ఇంటికి సమాచారం ఇచ్చాడు. దాంతో వారు అప్రమత్తమై 100కు సమాచారం ఇవ్వడంతో కానిస్టేబుల్ మాధవరెడ్డి హుటాహుటిన అక్కడికి వెళ్లి పురుగుల మందు తాగేందుకు సిద్ధంగా ఉన్న జాకోబ్‌ను కాపా డి అనంతరం వారి బంధువులకు సమాచారం ఇచ్చి వారికి అప్పగించారు. బంధువులు మాట్లాడుతూ పోలీసు చాకచక్యంతో మా కుటుంబ పెద్దను కాపాడారని శబాష్ పోలీసు అంటూ వారిని అభినందించారు.

మహారాజశ్రీ బద్వేలు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No. 60/2023

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ వారి తరపున బ్రాంచ్ మేనేజర్, బద్వేల్ శాఖ, బద్వేలు - వాది

V/s

ముద్దం నాగేంద్ర తండ్రి లేట్ నాగయ్య, వయస్సు 39సం. ముద్దంవారిపల్లె గ్రామం, పోరుమామిళ్ళ మండలం, కడపజిల్లా. - 4వ ప్రతివాది

పై నెంబరు దావాలో వాది, ప్రతివాది అయిన మీపైన లోను బాకీ రు. 1,87,250/-లు రాబట్టుకొనుటకుగాను దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకేమైనా ఆక్షేపణలున్న యెడల 02-05-2025వ తేది ఉదయం 10.30 గంటలకు హాజరై తెలుపుకొనవలసినది. లేనంతట మీ పరోక్షంగా దావాను తీర్మానించబడును.

ప్రదీప్‌కుమార్ పవార్, నూతి శ్రీనివాసులు
అడ్వకేట్స్, బద్వేలు

నాడు-నేడుకు నిధుల కొరత

- అర్ధాంతరంగా నిలిచిపోయిన నిర్మాణ పనులు
- 42 స్కూళ్ల భవనాలకు రూ.12కోట్లు కాగా విడుదలైనది రూ.8కోట్లు
- వేధిస్తున్న అదనపు భవనాల సమస్య
- ప్రస్తుత ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పూర్తిచేయాలని వినతి



పోరుమామిళ్లలోని జిల్లా పరిషత్ హైస్కూలులో అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలు

పోరుమామిళ్ల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ హయాంలో నాడు-నేడు పథకం కింద చేపట్టిన పాఠశాలల భవనాలకు నిధుల కొరత వేధిస్తోంది. దీంతో అర్ధాంతరంగా భవనాలు ఆగిపోవడంతో విద్యాబోధనకు సౌకర్యాల్లేక ఇబ్బందులు తప్పడంలేదు. పోరుమామిళ్ల మండలంలో నాడు-నేడు 42 పాఠశాలల భవనాలు, అదనపు గదుల నిర్మాణాలకు సంబంధించి రూ.12 కోట్లు నిధులు మంజూరు కాగా 8 కోట్లు మాత్రమే విడుదల చేసింది. రూ.4కోట్లు వస్తే కానీ అసంపూర్తి భవనాలను పూర్తి చేయలేని పరిస్థితి. దళితవాడలో పది రకాలకు సంబంధించి పనులు అయిపోగా టాయ్‌లెట్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. గానుగపెంట జిల్లా పరిషత్ హైస్కూలులో టెన్‌కాంపోనెంట్స్ పనులు అయిపోగా అదనపు తరగతి గదుల నిర్మాణానికి రెండు లెంటల్ లెవల్‌లోనే ఉండిపోయాయి. రేపల్లెలో కిచెన్‌షెడ్డు మినహా అన్ని పూర్తయ్యాయి. పోరుమామిళ్ల జిల్లాపరిషత్ హైస్కూలులో అదనపు తరగతిగదుల నిర్మాణాలు పూర్తి కావాల్సి ఉంది. ఒకటి గోడౌన్ వరకు పనులు పూర్తయ్యాయి. టెన్‌కాంపోనెంట్స్ పనులు మాత్రం పూర్తయ్యాయి. వెంకటాపురం జిల్లాపరిషత్ హైస్కూలులో అదనపు తరగతి గదుల నిర్మాణాలు లెంటల్ లెవెల్‌లో ఉండిపోగా అంగన్వాడీ నిర్మాణం శ్లాబు పూర్తయింది. ఫినిషింగ్ వర్క్ జరగాల్సి ఉంది. ఇందిరానగర్‌లో టెన్ కాంపోనెంట్స్ పనులు పూర్తయినా కిచెన్,టాయిలెట్లు పెండింగ్‌లో ఉండిపోయాయి. కవలకుంట్ల జిల్లాపరిషత్ హైస్కూలులో అదనపు తరగతి గదుల నిర్మాణాలు మూడు శ్లాబులెవల్ వరకు వచ్చాయి. ఎస్సీ కాలనీలో టెన్‌కాంపోనెంట్స్ పూర్తయినా కిచెన్ షెడ్డు పూర్తికావాల్సి ఉంది. పెద్దకప్పలపల్లెలో అదనపు తరగతి గదులు లెంటల్ లెవల్ వరకు జరిగాయి. టేకూరుపేటలో అదనపు తరగతి గదుల నిర్మాణం బేస్మట్టం లెవల్‌లోనే ఉండిపోయాయి. పోరుమామిళ్ల ఎంపీపీ మెయిన్ స్కూలు చిన్నచిన్న పనులు తప్ప మిగతావి పూర్తయ్యాయి. ఉర్దూ జిల్లా పరిషత్ హైస్కూలులో టాయిలెట్లు నిర్మాణాలు పూర్తి కావాల్సి ఉంది. కాపు వీధిలో టాయిలెట్ల నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. 16వవార్డులోని ఉర్దూ స్కూలులో కూడా టాయిలెట్లు నిర్మాణం పెండింగ్‌లోఉంది. గిరినగర్‌లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఫస్ట్‌ఫ్లోరు అయిపోయాయి. గోడల నిర్మాణం, అంగన్వాడీ నిర్మాణాలు పూర్తికావాల్సి ఉంది. ఈ నిర్మాణాలన్నీ వచ్చే విద్యాసంవత్సరానికి పూర్తికావాలంటే కనీసం గత ప్రభుత్వం చేసిన అంచనాల ప్రకారం రూ.4 కోట్లు నిధులు మంజూరు కావాల్సిఉంది. కానీ ప్రస్తుతం పది శాతం పెండింగులో ఉన్న 14 స్కూళ్లకు సంబంధించి రూ.23,70,733 నిధులు మంజూరయ్యాయి. అవి కూడా ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చేంత వరకు ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టకూడదని ఆదేశాలుండడంతో పనులు చేపట్టలేకున్నారు. కాగా నాడు-నేడు పనుల నిర్మాణాల విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఓబన్నను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, గతంలో వాటి పర్యవేక్షణ బాధ్యతలు తమకు అప్పజెప్పారని, ప్రస్తుతం ఉన్నతాధికారుల ఆదేశాలు వచ్చేంత వరకు డబ్బులు ఖర్చు పెట్టకూడదని ఆదేశాలు ఉన్నాయన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు ఎలా వస్తాయో ఆ మేరకు పనులు చేపట్టి పూర్తి చేస్తామన్నారు.

అభివృద్ధే టీడీపీ ప్రధాన లక్ష్యం : ఎంపీపీ



మాట్లాడుతున్న ఎంపీపీ ధనలక్ష్మి

గోపవరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి టీడీపీ ప్రధాన లక్ష్యమని గోపవరం మండల అధ్యక్షురాలు ధనలక్ష్మి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు ప్రజలకు అన్ని వేళాల అందుబాటులో ఉండి వారికి ఏర్పడే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఎంపీడీవో రామనాధరెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందిస్తున్నామన్నారు. జడ్పీటీసీ జయరామిరెడ్డి ఈవోపీఆర్‌డి షేక్ హసీనా, మండల వైద్యశాఖాధికారి మహేశ్వరరెడ్డి, అగ్నిమాపక శాఖ అధికారి చంద్రుడు, ఐసీడీఎస్ సూపర్‌వైజరు లక్ష్మీదేవిలు మాట్లాడారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల అవినీతిపై ఫిర్యాదు

దువ్వూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నసింగనపల్లె, చల్లబసాయిపల్లె ఫీల్డ్ అసిస్టెంట్ల జాబ్‌కార్డుల గోల్‌మాల్, అవినీతిపై ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీవో రామకృష్ణయ్య తెలిపారు. డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ విచారణ జరుపనున్నట్లు చెప్పారు. గురువారం ఫిర్యాదుదారుల వద్దకు నేరుగా వెళ్లి విచారణ చేస్తామని ఎంపీడీవో వెల్లడించారు.

ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలి

ముద్దనూరు ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి):రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని ఏడీఏ వెంకటసుబ్బయ్య సూచించారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం ఖరీఫ్ ప్రణాళిక పై వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. అందులో భాగంగా ఏడీఏ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా సహజ సిద్ధమైన పంటలు వస్తాయన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ను అనుసరించి పంట సాగు చేస్తున్న రైతులు రామలింగమనాయుడు,వెంకటేశ్వర్లరెడ్డి లను అభినందించి,సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏవో వెంకటకృష్ణారెడ్డి, ఏపీఎం అపర్ణదేవి, సీసీ ఇబ్రహీం, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నూజహత్, రామసుధ రైతులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి):ఎర్రగుంట్ల ప్రకాష్‌నగర్‌లో పేకాట ఆడుతున్న 7 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.78వేలు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో కొందరు తప్పించుకున్నట్లు సమాచారం రావడంతో దాడులు విస్తృతం చేసినట్లు పోలీసులు తెలిపారు.

గ్రంథాలయాలు విజ్ఞాన సోపానాలు

కొండాపురం, ఏప్రిల్28 (ఆంధ్రజ్యోతి):గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంచుతాయని లైబ్రేరియన్ వరలక్ష్మి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమవారం నుంచి మే6 వ తేదీ వరకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా పుస్తక పఠనం, చెస్, క్యారమ్, తదితర వాటిని నిర్వహించడం జరుగుతుందన్నారు.

వేసవి శిక్షణ ప్రారంభం

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ సందర్భంగా సోమవారం రామేశ్వరంలోని బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో వసంత మున్సిపల్ హైస్కూలు విద్యార్థులకు సమ్మర్‌క్యాంపు ప్రారంభించారు. ఈ సందర్భంగా మొదటిరోజు విద్యార్థులకు దైవభక్తి కథలను బోధించారు. అనంతరం విద్యార్థులకు జిరాఫీ చెస్ గురించి కోచ్‌లు నాగార్జున, అరవింద్ శిక్షణ ఇచ్చారు. ఖోఖో ఆటలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వసంతపేట మున్సిపల్ హైస్కూలు హెచ్‌ఎం సుజాతమ్మ, ఉపాధ్యాయులు, గ్రంథాలయం రికార్డు అసిస్టెంట్ ఇబ్రహీంసాహెబ్, పాల్గొన్నారు.

ప్రపంచమానవాళి సుఖసంతోషాలతో ఉండాలి

- తొగటవీర క్షత్రియుల కుల గురువు దివ్యజ్ఞానానందగిరి స్వామిజీ



ఎర్రగుంట్లలో దివ్యజ్ఞానాందగిరి స్వామిజీ

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రపంచ మానవాళి సుఖ సంతోషాలతో ఉండాలని తొగటవీర క్షత్రియ కుల గురువు దివ్యజ్ఞానానందగిరి స్వామిజీ పేర్కొన్నారు. ఎర్రగుంట్ల చౌడేశ్వరీదేవి ఆలయాన్ని సోమవారం స్వామీజీ సందర్శించారు. కర్ణాటకలోని దొడ్డబలాపూర్ నుంచి ఇక్కడికి విచ్చేశారు. ఆయన సంవత్సరంలో కొన్ని రోజులు చౌడేశ్వరీదేవి ఆలయాలను సందర్శించి కులస్థులకు సామాజికంగా, విద్యా పరంగా అభివృద్ధిపథంలో పయనించాలని సూచించారు. ఎర్రగుంట్ల చౌడేశ్వరీదేవి ఆలయ కమిటీ వారు నాలుగు కూడలి నుంచి బిందెసేవా, నాథం, బ్యాండు మేళాలతో వేదపండితులతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ, జాతీయ ఉపాధ్యక్షుడు పల్లా శేషయ్య, ఎర్రగుంట్ల చైర్మన్ కోనేటి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి బడిగించల సంజీవయ్య, టీచర్ ,రంగయ్య, తొగటవీర క్షత్రీయ కులస్థులు ప్రకాష్‌నగర్ యూత్ కార్యవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కంటివైద్యుడు ఈశ్వరరెడ్డి మృతి



జమ్మలమడుగు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణానికి చెందిన ప్రముఖ కంటి వైద్యుడు ఈదుల ఈశ్వరరెడ్డి (83) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతిచెందారు. ఈయన జమ్మలమడుగు తేరురోడ్డులో నివాసం ఉన్నారు. 1970లో గుంటూరు మెడికల్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అలాగే తిరుపతి రుయా ఆస్పత్రిలో మెడికల్ సూపరింటెండెంట్‌గా పనిచేసి 1972లో ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు తెలిపారు. అనంరం జమ్మలమడుగు తాడిపత్రి రోడ్డులో ప్రైవేటు ఆస్పత్రి నిర్వహిస్తూ జమ్మలమడుగు ప్రాంతంలో ప్రముఖ కంటి డాక్టర్‌గా ఈదుల ఈశ్వరరెడ్డి మంచి పేరు తెచ్చుకున్నారు. . ఈయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. ఒక కుమారుడు అమెరికాలో ఉన్నారు.

దాడి చేసిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

బి.కోడూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అంకనగొడుగునూరు ఎస్సీ కాలనీకి చెందిన సురేంద్రపై దాడి చేసిన రామసుబ్బయ్య, రమేశ్‌లపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సీపీ రాజు సోమవారం తెలిపారు. వారిరువురూ సురేంద్రపై దాడి చేసి కులం పేరుతో దూషించారని బి.కోడూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించిన ఎస్‌ఐ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ముగిసిన రాష్ట్రీయ సేవికా సమితి శిక్షణ

బద్వేలు రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) :మండల పరిధిలోని నందిపల్లె గ్రామంలో రాష్ట్రీయ సేవికా సమితి జిల్లా ప్రారంభిక వర్గ శిక్షణా తరగ తులు సోమవారం ముగిశాయి. జిల్లా కార్యవాహక మాధవీ, బద్వేలు సేవికా సమితి కార్యకర్తలు ధనలక్ష్మి, కవితా ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి 28వరకు ఐదురోజుల పాటు జరిగిన శిక్షణలో జిల్లా నలుమూలల నుంచి 125 మంది మహిళలు పాల్గొన్నారు. సమరోహ కార్యక్రమంలో బి.మఠం అచలానంద ఆశ్రమ పీఠాధిపతులు విరజానందస్వామి మాట్లాడు తూ మహిళ చైతన్యమైతే కుటుంబ సభ్యులందరూ చైతన్యవంతులు అవుతారన్నారు.

డీసీసీబీ ఛైర్మన్ నియామకంపట్ల సంబరాలు



బాణాసంచాపేల్చి సంబరాలు జరుపుకుంటున్న కార్యకర్తలు, అభిమానులు

బద్వేలుటౌన్, ఏప్రిల్ 28 (ఆం ధ్రజ్యోతి) : టీడీపీ సీనియర్ నాయకుడు మంచూరి సూర్య నారాయణరెడ్డిని టీడీపీ అధిష్ఠానం డీసీసీ బ్యాంక్ ఛైర్మన్‌గా నియమించడంపట్ల సోమవారం కార్యకర్తలు, అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. డీసీసీబీ ఛైర్మన్‌గా సూర్యనారాయణరెడ్డి ఎంపికకావడంపట్ల బద్వేలులో భారీగా బాణాసంచాపేల్చి, కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లాలో బద్వే లుకు గౌరవస్థానం కల్పించారని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు కార్యకర్తలందరం పార్టీకోసం అహర్నిశలు కృషిచేసి బద్వేలు నియోజకవర్గవర్గాన్ని టీడీపీ కంచుకోటగా మార్చుతామన్నారు. డీసీసీబీ ఛైర్మన్‌గా సూర్యనారాయణరెడ్డిని ఎంపిక చేయడం హర్షించదగ్గ విషయమన్నారు.

కాశినాయనలో: ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు డీసీసీబీ ఛైర్మన్‌గా అట్లూరు మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ప్రముఖ రైల్వే కాంట్రాక్టర్ మంచూరు సూర్యనారాయణరెడ్డిని నియమించడం పార్టీ బలోపేతానికి శుభపరిణామని కడప టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు ఎం.రాజారెడ్డి పేర్కొన్నారు. అందుకు సహకరించిన బద్వేల్ టీడీపీ నాయకురాలు మాజీ ఎమ్మెల్యే కె.విజయమ్మ సమన్వయకర్త కే.రితేష్‌రెడ్డికి వారు ఈసందర్భంగా అభినందనలు తెలియజేశారు.

భూసమస్యలు పరిష్కరించి.. పేదలకు పంపిణీ

- ప్రజలు సహకరించండి అభివృద్ధి చేసి చూపిస్తా : ఎమ్మెల్యే పుట్టా



నవోదయ పాఠశాల స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 28 (ఆంధ్ర జ్యోతి) : బ్రహ్మంగారిమఠం మండలంలో భూసమస్యలు పరిష్కరించి మిగిలిన భూములను నిరుపేదలకు పంపిణీ చేస్తానని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో పాత్రికేయులతో ఎమ్మెల్యే పుట్టా మాట్లాడుతూ ప్రజల సహాయ సహకారాలు అవసరమని, రాబోవు రోజుల్లో భూ ఆక్రమణ చేసిన వారి వద్ద నుంచి భూములు స్వీకరించి భూములు లేని నిరుపేదలకు పంపిణీ చేస్తామని తెలిపారు. అలాగే భూసర్వే కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారని వారు వచ్చి పూర్తి స్థాయిలో పరిశీలించి ఎవరైతే అక్రమంగా భూములు ఆన్‌లైన్‌లో చేయించుకున్నారో వారి పేర్లను తొలగించి నివేదికను కలెక్టర్‌కు అందించడం జరుగుతుందన్నారు. అంతకు ముందు మండలంలోని పలుగురాళ్లపల్లె పొలం మల్లేపల్లె ప్రాంతంలో నూతనంగా నవోదయ పాఠశాలను నిర్మాణం చేపట్టేందుకు బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, తహసీల్దారు దామోదర్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే పుట్టా స్థలాన్ని పరిశీలించారు. తోట్లపల్లె గ్రామంలో దాదాపు రూ.25 కోట్లు పెట్టి నిర్మించిన మహా గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే పరిశీలించారు. అలాగే కాలజ్ఞానకర్త పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాములవారి దేవస్థానంలో ఇటీవల అభివృద్ధి పనులను ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ ఆహ్వానం మేరకు ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు జాన్సన్. ఎంపీడీవో కిశోర్, టీడీపీ అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, ముడుమాల పోలిరెడ్డి, ఎల్లటూరు సాంబశివారెడ్డి, ఎస్‌ఆర్ శ్రీనివాసులరెడ్డి, సర్పంచ్ నారాయణ, యత్తపు ఈశ్వర్‌రెడ్డి, నాగయ్య, సుధాకర్, ముదుక్రిష్ణమనాయుడు, జాండ్లవరం సుబ్బనాయుడు, జయరాంనాయుడు, పూజా శివతో పాటు టీడీపీ నేతలు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు కొండంత అండగా టీడీపీ



టీడీపీ కార్యకర్త భర్తకు ఇన్సూరెన్స్ చెక్కును అందిస్తున్న ఇన్‌ఛార్జ్ భూపేష్‌రెడ్డి

పెద్దముడియం, ఏప్రిల్ 28 (ఆంధ్ర జ్యోతి) : పార్టీలోని ప్రతి ఒక్క కార్యకర్తకు టీడీపీ కొండంత అండగా ఉంటుందని ఇన్‌చార్జ్ భూపేష్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని సుద్దపల్లె గ్రామానికి చెందిన డి.అనూష ఇటీవల ప్రమాదశాత్తు మరణించింది. ఈమెకు టీడీపీ సభ్యత్వ నమోదు ఉండడం రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యం, పార్టీ ప్రధానకార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఆలోచనలో భాగంగా ప్రతి ఒక్క టీడీపీ కార్యకర్తకు ఇన్సూరెన్స్ చేయించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా అనూషకు కూడా టీడీపీ సభ్యత్వ నమోదు, బీమా రూ.5లక్షలు మంజూరు చేయించడం జరిగిందని ఆమేరకు మంజూరైన బీమా చెక్కును భూపేష్‌రెడ్డి సోమవారం ఆమె భర్తకు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, ఇతర టీడీపీ నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా న్యాయవాదుల ర్యాలీ



నిరసన ర్యాలీ చేపట్టిన న్యాయవాదులు

బద్వేలు రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జమ్మకశ్మీర్ ప్రాంతంలోని పహల్గాంలో ఈ నెల 22న పర్యాటకులపై మతోన్మాద తీవ్రవాదులు దాడులు చేసి మతం అడిగి మరీ అత్యంత కిరాతకంగా చంపడాన్ని నిరసిస్తూ న్యాయవాదులు సోమవారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఈసందర్భం గా వారు మాట్లాడుతూ అమాయ క పర్యాటకులను మతం అడిగి మరీ 26 మందిని నిర్ధాక్షిణ్యంగా హతమార్చడం హేయమైనచర్య న్నారు. దీని వెనుక పాకిస్థాన్ హస్తం ఉందని ఆధారాల ఉన్నందున ఆ దేశానికి సరైన బుద్ధి చెప్పాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. తీవ్రవాదంపై కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ సందర్భంగా మృతులకుటుంబాలకు ప్రగాఢ సానభూతి తెలిపారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంటు డీవీఎస్‌ఆర్ క్రిష్ణ, జనరల్ సెక్రటరీ మురళీక్రిష్ణ, సీనియర్ న్యాయవాదులు బ్రహ్మారెడ్డి, రాజేశ్వర్‌రావు, ప్రదీప్‌కుమార్‌పవార్, చంద్ర ఓబుల్‌రెడ్డి సూర్యనారాయణరెడ్డి, సురేశ్ బాబు, శ్రీధర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో ప్లాస్టిక్ పూర్తిగా నిషేధం

- అమ్మినా, కొన్నా భారీగా జరిమానా : కమిషనర్



దుకాణ, వ్యాపారస్థులతో మాట్లాడుతున్న కమిషనర్ శేషఫణి

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్లలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్లు కమిషనర్ శేషఫణి తెలిపారు. సోమవారం ఎర్రగుంట్లలోని వర్తకులు, దుకాణాదారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటుచేసి వారికి ప్లాస్టిక్ వినియోగం వాటివల్ల కలిగే నష్టాలు, పర్యావరణానికి ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఇకపై ఎర్రగుంట్లలో ప్లాస్టిక్ కవర్లు, కప్పులు, గ్లాసుల వినియోగంపై పూర్తిగా నిషేధం విధిస్తున్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి అమ్మినవారికి రూ.2500 నంచి రూ.5000వరకు జరిమానా విధిస్తామన్నారు. అలాగే ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రోత్సహించిన వ్యక్తులకు రూ.250 నుంచి రూ.500వరకు జరిమానా విధిస్తామన్నారు. ఇకపై దుకాణాల్లో ఎవరూ ప్లాస్టిక్ అమ్మకాలు చేయరాదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ పుల్లయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మానవత్వాన్ని చాటుకున్న ప్రధానోపాధ్యాయుడు

కాశినాయన ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి):మండలంలోని నర్సాపురం గ్రామానికి చెందిన గోసల సుబ్బమ్మ అనే నిరుపేద మహిళకు మూలపల్లె ప్రభుత్వ పాఠశాలలో ప్రదానోపాధ్యాయుడుగా పనిచేస్తున్న చంద్రశేఖర్ రూ.30వేలు స్వంత నిధులు వెచ్చించి బాత్‌రూమ్ నిర్మించి మానవత్తం చాటుకున్నాడు. సుబ్బమ్మ షుగర్ వ్యాధితో కాలు ఆపరేషన్ చేయించుకొని మంచానికి పరిమితమయ్యింది. ఈమె అనారోగ్యం బారిన పడటంతో కుటుంబ పరిస్థితి ఇబ్బందిగా మారింది. కాలకృత్యాలు తీర్చుకొనుటకు మరుగుదొడ్డి కట్టించుకోలేని ధీనస్థితిలో ఉన్న పరిస్థితి గమనించి బాతురూము నిర్మించి ఇచ్చి మానవత్వాన్ని చాటుకున్నాడు. గతంలో కూడా ఆమెకు రూ.5వేలు నగదుతోపాటు నిత్యావసర సరకులు అందజేసి నేనున్నానంటూ ఆకుటుంబానికి భరోసా కల్గించాడు.

టీడీపీ నేత పిచ్చినాయుడు కుటుంబానికి పరామర్శ

ఖాజీపేట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పత్తూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పిచ్చినాయుడు కుటుంబాన్ని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సోమవారం పరామర్శించారు. అనారోగ్యంతో టీడీపీ నాయకుడు పిచ్చినాయుడు రెండు రోజుల క్రితం మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే టీడీపీ నేత స్వగృహానికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన భార్య మాజీ సర్పంచ్ రామలక్షుమ్మను ఓదార్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ పార్టీ కోసం పిచ్చినాయుడు ఎంతో కృషి చేశారని, ఆయన కుటుంబాన్ని పార్టీ ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, రవి, రామానాయుడు, పుల్లయ్యనాయుడు, ప్రతాప్‌రెడ్డి, సిద్దారం కదిరుల్లా, బుచ్చిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, బొగ్గుల చంద్ర ఓబుళరెడ్డి, హరినాథరెడ్డి, క్రిష్టారెడ్డి, జెండాల మాబాష, నంద్యాల సుబ్బయ్య, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల మృతి పార్టీకి తీరనిలోటు

మైదుకూరు రూరల్ ,ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : టీడీపీ నేతల మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పేర్కొన్నారు. మైదుకూరు మున్సిపాలిటీలోని వార్డు కౌన్సిలర్ ఖాదర్‌బాషా ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పుట్టా సోమవారం ఖాదర్‌బాషా ఇంటికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించాడు. అనంతరం వనిపెంట రోడ్డులోని టీడీపీ నాయకుడు దండు వీరయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. ఆయన కుటుంబాన్ని కూడా ఎమ్మెల్యే పుట్టా పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, ధనపాల జగన్, ఏపీ రవీంద్ర, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.